ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers

PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 254

ఆదివారం 27 సెప్టెంబర్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.



భారత్ ఇంధన అవసరాల వైపు.. అమెరికా చూపు

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 26)

పశ్చిమాసియా ఉద్రిక్తతలతో హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడినప్పటి నుంచీ భారత్.. ఇంధన దిగుమతుల కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఈ క్రమంలోనే భారత్ అవసరాలకు తగ్గట్టు ఇంధనం సరఫరా చేయాలని ట్రంప్ యంత్రాంగం యోచిస్తున్నట్లు అమెరికా విదేశాంగ శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు, ఇంధన ఆంక్షల విషయంలో అమెరికా కఠిన వైఖరి అనుసరిస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో భారత్‌కు భారీగా ఇంధన అవసరాలు ఉన్నందున.. ఆ అవకాశాన్ని తాము వినియోగించుకోవాలని అనుకుంటున్నట్లు పేర్కొన్నారు.యుద్ధం వల్ల కొన్ని నెలలపాటు ఇరాన్, పశ్చిమాసియా దేశాల నుంచి చమురు ఎగుమతులు నిలిచిపోవడంతో ప్రపంచ మార్కెట్‌లో ఇంధన లభ్యత పరిమితంగా ఉందని సదరు అధికారి పేర్కొన్నారు. అయితే వెనెజువెలాపై ట్రంప్ చేపట్టిన విజయవంతమై ఆపరేషన్‌తో ప్రస్తుతం అమెరికా వద్ద పెద్ద మొత్తంలో చమురు నిల్వలు ఉన్నాయన్నారు. భారత్ వంటి మిత్ర దేశాలకు చమురు విక్రయించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ▶మిగతా 2లో

ఓటుబ్యాంకు రాజకీయాలు మనకొద్దు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 26)

ఓటు బ్యాంకు రాజకీయాలకు బదులుగా సామాజిక సంస్కరణలు, సానుకూల మార్పులపై దృష్టి సారించాలని భాజపా కార్యకర్తలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. వారణాసి నుంచి వాడ్‌నగర్ వరకు సాగుతున్న సేవా యాత్ర (మోటార్ సైకిల్ ర్యాలీ)లో పాల్గొంటున్న వారితో శుక్రవారం ప్రధాని వీడియో విధానంలో మాట్లాడారు. గత 12 ఏళ్లలో దేశంలోని నగరాలు, గ్రామా ల మధ్య అంతరం గణనీయంగా తగ్గిందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఎంతో మెరుగుపడ్డాయని మోదీ పేర్కొన్నారు.దేశ మహిళల్లో స్వయం సమృద్ధి కూడా పెరిగిందని ఆయన అన్నారు. “ మహాత్మా గాంధీ జీవితాన్ని పరిశీలిస్తే, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడటం, స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించడంతో పాటు, ఆయన ఒక గొప్ప సామాజిక సంస్కర్తగానూ నిలిచారని మనకు అర్థమవుతుంది. సమాజంలో ఉన్న దురాచారాలకు వ్యతిరేకంగా ఆయన ఎల్లప్పుడూ కృషి చేశారు. కాబట్టి రాజకీయ కార్యకర్తలుగా మనం కూడా ఓటు బ్యాంకుల గురించి ఆలోచించకుండా, సామాజిక సంస్కరణ, సానుకూల మార్పు దిశగా కృషిని కొనసాగించాలి” అని మోదీ అన్నారు.

‘మేక్ ఇన్ ఇండియా’పై..

భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చాలనే లక్ష్యంతో ప్రారంభమైన ‘మేక్ ఇన్ ఇండియా’ కార్యక్రమం 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ తాజాగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 12 ఏళ్లుగా వివిధ రంగాల్లో వచ్చిన మార్పులను ఆయన తన పోస్ట్‌లో ప్రస్తావించారు. 2014 సెప్టెంబరు 25న ప్రధాని మోదీ మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెట్టుబడులను ఆకర్షించడం, ▶2లో

తగ్గిన టీడీపీ విరాళాలు.. అధికారంలోకి వచ్చాక ఆసక్తికర పరిణామం!



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 26)

ఏపీలో అధికారంలో ఉన్న టీడీపీకి 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను విరాళాలు అందాయి. ఈ ఏడాది పార్టీకి మొత్తం రూ.58.25 కోట్ల నిధులు సమకూరినట్లు టీడీపీ ప్రధాన కార్యదర్శి పి. అశోక్‌బాబు కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదికలో వెల్లడించారు. అయితే, గత రెండేళ్లతో పోలిస్తే విరాళాల మొత్తం తగ్గడం గమనార్హం.

ప్రధాన దాతలు వీరే..టీడీపీకి అందిన మొత్తం విరాళాల్లో సింహభాగం ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచే వచ్చింది. ఈ ట్రస్ట్ ఆరు వేర్వేరు విడతల్లో మొత్తం రూ.45 కోట్లు విరాళంగా ▶2లో

పిక్సెల్స్ అయినా, పైపులైనా.. లక్ష్యం ఒక్కటే

‘ది ప్రింట్’ కథనంపై సీఎం చంద్రబాబు స్పందన

ది ప్రింట్ వ్యవస్థాపకుడు శేఖర్ గుప్తా పోస్టుపై స్పందించిన చంద్రబాబు

పిక్సెల్స్ నుంచి పైపుల వైపు తన పాలన పయనం సాగిందన్న సీఎం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 26)

ప్రముఖ ఆంగ్ల మీడియా సంస్థ ‘ది ప్రింట్’ వ్యవస్థాపకుడు శేఖర్ గుప్తా పెట్టిన ఓ సోషల్ మీడియా పోస్టుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. తన పాలనా విధానం, ప్రాధాన్యతలపై జరుగుతున్న విశ్లేషణపై ఆయన తన అభిప్రాయాలను స్పష్టంగా పంచుకున్నారు. ‘పిక్సెల్స్ నుంచి పైపుల వైపు’ సాగుతున్న తన ప్రయాణం వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరిస్తూ, అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరాలన్నదే తన స్థిరమైన నమ్మకమని పునరుద్ఘాటించారు.

‘ది ప్రింట్’ మీడియాలో వచ్చిన ఒక కథనాన్ని శేఖర్ గుప్తా ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. చంద్రబాబు తన ‘సీఈఓ-సీఎం’ ఇమేజ్‌ను మార్చుకుని, గ్రామీణ ప్రాంతాల్లో టీడీపీకి ఆదరణ పెంచుకునేందుకు ‘పిక్సెల్స్’ (టెక్నాలజీ) నుంచి ‘పైపుల’ (సాగునీటి) వైపు ఎలా పయనిస్తున్నారనే విశ్లేషణ ఆ కథనంలో ఉంది. ఈ పోస్టుపై స్పందించిన చంద్రబాబు, తన రాజకీయ ప్రస్థానం వెనుక ఉన్న మూల సిద్ధాంతాన్ని తెలియజేశారు. ▶మిగతా 2లో



అణ్వాయుధాల తయారీ దిశగా సౌదీ: అమెరికా నిఘా వర్గాల



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 26)

అణ్వాయుధ తయారీలో పశ్చిమాసియా దేశాల మధ్య పోటీపై మళ్లీ చర్చ మొదలైంది. సౌదీ అరేబియా అణ్వాయుధాల తయారీ దిశగా వెళ్లే అవకాశాన్ని కొట్టిపారేయలేమని అమెరికా నిఘా వర్గాలు అంచనా వేశాయి. అణు బాంబులు తయారు చేసేందుకు ఆ దేశం ఆసక్తి చూపించొచ్చని అభిప్రాయపడ్డాయి. ఈ మేరకు అగ్రరాజ్య కాంగ్రెస్ కు అందించిన తమ రహస్య నివేదికలో ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి.పౌర అవసరాల కోసం సౌదీ అరేబియాకు యురేనియం ఇచ్చేందుకు.. ఆ దేశంతో 30 ఏళ్ల సుదీర్ఘకాల ఒప్పందానికి ఇటీవల ట్రంప్ ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ డీల్‌పై అమెరికా చట్టసభ సభ్యుల్లో కొందరు ఆందోళన వ్యక్తం చేశారు. సౌదీకి యురేనియం శుద్ధి సాంకేతికతను అందిస్తే.. భవిష్యత్తులో అణ్వాయుధాల తయారీకి అవసరమైన సామర్థ్యం వారికి అందుబాటులోకి వస్తుందని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నవంబర్ తర్వాత ఇరాన్‌పై మళ్లీ బాంబులు.. శాంతి ప్రణాళికను తిరస్కరించిన ట్రంప్..!

ఈ ఒప్పందం ప్రకారం సౌదీకి 5 శాతం లోపు మాత్రమే యూరేనియం శుద్ధికి పరిమితులు ఉన్నాయి. భవిష్యత్తులో దీనిని 20 శాతం వరకు పెంచే అవకాశంపై చర్చ జరుగుతోంది. ▶2లో

యువత ఉజ్వల భవిష్యత్తు కోసం భారీ పరిశ్రమలను రప్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది: మంత్రి గొట్టిపాటి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 26)

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఒంగోలులో ఈరోజు



నిర్వహించిన కానిస్టేబుల్స్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ ముగించుకుని విధులకు సన్నద్ధమవుతున్న నూతన కానిస్టేబుళ్లకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ... రాష్ట్ర యువత ఉజ్వల భవిష్యత్తు కోసం సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని పేర్కొన్నారు. కేవలం ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా, ప్రైవేట్ రంగంలోనూ ఉపాధి అవకాశాలు పెంచేందుకు ▶మిగతా 2లో

ఈసీ వర్సెస్ విపక్షం...బీజేపీకి షాక్ ఇచ్చేలా జగన్ !

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 26)



ప్రస్తుతం చూస్తే కేంద్ర ఎన్నికల సంఘాన్ని టార్గెట్ చేస్తూ జాతీయ స్థాయిలో విపక్షాలు పెద్ద ఎత్తున విమర్శలు చేస్తున్నాయి. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ నుంచి వామపక్షాలు ఇతర పార్టీలు అన్నీ కలసి ఈసీ విశ్వసనీయతను ప్రశ్నిస్తూ వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వాన్ని కూడా లక్ష్యంగా చేసుకుని విమర్శలు ఎక్కు పెడుతున్నాయి. అయితే దక్షిణాది నుంచి బలమైన రాజకీయ గొంతుకలేవీ ఇందులో పెద్దగా వినిపించలేదు, కాంగ్రెస్ మూడు రాష్ట్రాలలో అధికారంలో ఉండడంతో సహజంగా విమర్శలు చేస్తోంది. బీఆర్ఎస్ నుంచి ఈసీ తీరు మీద ▶మిగతా 2లో

నన్ను అంతా ‘డోలో 650’ అంటారు : లోకేశ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 26)

గుజరాత్ లో పర్యటనలో మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనను ఆంధ్రప్రదేశ్ “డోలో-650” అని పిలుస్తుంటారని సరదాగా వ్యాఖ్యానించారు. తలనొప్పి వస్తేనే మందు బిళ్ల గుర్తుకు వచ్చినట్లు, పరిశ్రమలు లేదా పారిశ్రామికవేత్తలకు ఎక్కడైనా సమస్య తలెత్తితేనే తనను గుర్తుకు తెచ్చుకుంటారని అన్నారు. మిగతా సమయంలో మర్చిపోతుంటారని ఆయన నవ్వుతూ పేర్కొన్నారు. ఏపీలో పెట్టుబడులు ఆకర్షించేందుకు మంత్రి లోకేశ్ గుజరాత్ రాష్ట్రానికి చెందిన పలువురు పారిశ్రామిక వేత్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడిన వీడియో వైరల్ అవుతోంది. అధికారిక సమావేశాలలో ఎప్పుడూ సీరియస్‌గా, పాలనాపరమైన అంశాలపై స్పష్టమైన అవగాహనతో మాట్లాడే లోకేశ్.. ఈ భేటీలో మాత్రం తనదైన శైలిలో చమత్కారంగా మాట్లాడి పారిశ్రామికవేత్తలను విశేషంగా ఆకట్టుకున్నారని అంటున్నారు. ఎంటర్‌ప్రెన్యూర్లకు ఏ సమస్య వచ్చినా, ఏ రకమైన ‘తలనొప్పి’ (సవాల్) ఎదురైనా దానిని కేవలం ఒక వ్యక్తిగత సమస్యగా కాకుండా.. ప్రభుత్వం పరిష్కరించాల్సిన వ్యవస్థాపరమైన సమస్యగా తాను చూస్తానని లోకేశ్ స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తల వేగాన్ని అందుకోవడమే కాకుండా, వారి కంటే వేగంగా అడుగులు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తేల్చిచెప్పారు. భూ కేటాయింపులు, గ్రౌండ్ వర్క్ పూర్తి కావడం, కమర్షియల్ ప్రొడక్షన్ ప్రారంభం వంటి అంశాలకు సంబంధించి పారిశ్రామికవేత్తలే స్వయంగా టైమ్ లైన్‌లను నిర్ణయించవచ్చని, ఆ తేదీల కల్లా నీరు, విద్యుత్ వంటి అన్ని మౌలిక వసతులను సమకూర్చి సకాలంలో డెలివరీ చేస్తామని హామీ ఇచ్చారు. వేగం అంటే కేవలం నిర్ణయాలు వేగంగా తీసుకోవడం కాదని, వ్యవస్థ మొత్తాన్ని సమూలంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ తెలిపారు. యువ ఐఏఎస్ అధికారులతో కూడిన బృందం ప్రభుత్వ విధానాలను అమలు చేస్తూ, ఏ ఒక్క పారిశ్రామికవేత్తకు సమస్య ఎదురైనా తక్షణమే సరిదిద్దే తపనతో పనిచేస్తోందని చెప్పారు.ఇక దేశంలో పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుతున్న ఏపీలో, పరిశ్రమలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ‘సింగిల్ విండో’ లేదా అంతకంటే వేగవంతమైన విధానాలను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఎంతటి ప్రాధాన్యత ఇస్తోందనే విషయాన్ని మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు నిరూపిస్తున్నాయని ▶2లో



మొదటిపేజీ తరువాయి

పిక్సెల్స్ అయినా, పైపులైనా.. లక్ష్యం ఒక్కటే

ఈ సందర్భంగా చంద్రబాబు స్పందిస్తూ, "నా ప్రజా జీవితం ఒకే ఒక్క నమ్మకం చుట్టూ ముడిపడి ఉంది. అభివృద్ధి ఫలాలు కచ్చితంగా ప్రజల దైనందిన జీవితాలను మెరుగుపరచాలి. 1990లలో మారుతున్న ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా టెక్నాలజీ పర్యావరణ వ్యవస్థను నిర్మించడం, కొత్త అవకాశాలు సృష్టించడం నా ముందున్న కర్తవ్యం. కానీ, ఈ రోజు నా ప్రాధాన్యత మరింత మౌలికమైనది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న మన రైతులకు, ముఖ్యంగా చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడమే నా ముందున్న అతిపెద్ద లక్ష్యం" అని వివరించారు.

"అది పిక్సెల్స్ అయినా, పైపులైనా.. రెండింటి ఉద్దేశం ఒక్కటే. ప్రజల సమస్యలను పరిష్కరించడం, వారి జీవనోపాధిని బలోపేతం చేయడం, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి కుటుంబానికి మెరుగైన భవిష్యత్తును నిర్మించడం" అని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రయాణాన్ని కథనంలో చక్కగా వివరించినందుకు శేఖర్ గుప్తాకు, 'ది ప్రింట్' మీడియాకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు 'హైటెక్ సీఎం'గా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి పెద్దపీట వేసిన నేతగా గుర్తింపు పొందారు. అయితే, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వ్యవసాయ రంగం, సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించడం ద్వారా గ్రామీణ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తన పాలనా ప్రాధాన్యతలు కాలానికి అనుగుణంగా మారతాయే తప్ప, ప్రజలకు సేవ చేయాలనే అసలు లక్ష్యం మాత్రం మారదని చంద్రబాబు తన స్పందన ద్వారా స్పష్టం చేశారు.

భారత్ ఇంధన అవసరాల వైపు.. అమెరికా చూపు

అమెరికా కాంగ్రెస్ ఇటీవల 'ద లిండ్సే గ్రాహమ్ శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్-2026' బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే. దీనిపై ట్రంప్ సంతకం కూడా చేయడంతో ఇది చట్టరూపం దాల్చింది. రష్యా, ఇరాన్‌లపై ఆంక్షలను విధించేందుకు, వాటితో వాణిజ్యం జరుపుతోన్న భారత్, చైనా వంటి దేశాలపై సుంకాల మోత మోగించేందుకు ఈ చట్టంతో ట్రంప్‌నకు అధికారం లభించినట్లయ్యింది. ఈ కొత్త చట్టం.. భారత్, అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపైనే కాకుండా అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపైనా ప్రభావం చూపుతుందని భారత ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది.

ఓటుబ్యాంకు రాజకీయాలు మనకొద్దు

తయారీని పెంచడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, మౌలిక వసతులను బలోపేతం చేయడం ఆ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలు. "భారత్‌లో మరింత తయారీ. భారత్‌లో మరింత పెట్టుబడి. భారత్ నుంచి మరింత ఎగుమతులు. వివిధ రంగాల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది' అని మోదీ పోస్టులో చెప్పారు.

భజన్ క్లబ్బింగ్‌లో ప్రధాని

హిందూ భక్తి గీతాలు పాడటం, చప్పట్లు కొట్టడం, నృత్యం వంటి యువత సంగీత కచేరీ అయిన 'భజన్ క్లబ్బింగ్'లో ప్రధాని మోదీ శనివారం పాలు పంచుకొన్నారు. దిల్లీలోని భాజపా ప్రధాన కార్యాలయానికి ఎదురుగా ఉన్న పార్కులో శనివారం రాత్రి నిర్వహించిన సంఘ్ పరివార్ సిద్ధాంతకర్త దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 110వ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ముందు వరుసలో కూర్చున్న ప్రధాని శ్రీరాముడిపై పాడిన పాటకు అనుగుణంగా కంజరిని పోలిన వాయిద్య పరికరం డఫ్లీతో తాళం వేశారు.

అణ్వాయుధాల తయారీ దిశగా సౌదీ: అమెరికా నిఘా వర్గాల

అయితే అణ్వాయుధాల తయారీకి సాధారణంగా 60-90 శాతం వరకు శుద్ధి చేసిన యురేనియం అవసరమవుతుంది. ఇదిలా ఉండగా.. ఇరాన్ అణు బాంబులను తయారు చేస్తే.. భద్రతా కారణాల దృష్ట్యా తాము కూడా అణ్వాయుధాలను సమకూర్చుకోవాల్సి వస్తుందని సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ గతంలో హెచ్చరించడం గమనార్హం.

యువత ఉజ్వల భవిష్యత్తు కోసం భారీ పరిశ్రమలను రప్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది: మంత్రి గొట్టిపాటి

రాష్ట్రానికి భారీ పరిశ్రమలను, పెట్టుబడులను రప్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని వెల్లడించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను పటిష్టం చేసే చర్యల్లో భాగంగానే సుమారు 6,100 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేశామని... స్వయంగా ముఖ్యమంత్రే అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారని గుర్తుచేశారు.

నన్ను అంతా 'డోలో 650' అంటారు : లోకేశ్

అంటున్నారు.పారిశ్రామికవేత్తల సమస్యలను తన వ్యక్తిగత బాధ్యతగా తీసుకుంటానని చెప్పడమే కాకుండా, తమ రాష్ట్రంలో పారిశ్రామిక అనుకూల విధానాలు అమలు చేస్తామని, నిరంతరం అండగా ఉంటామని చెప్పేందుకు లోకేశ్ ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు. మంత్రి లోకేశ్ అనుసరిస్తున్న ఈ అనధికారిక, స్నేహపూర్వక సమస్య పరిష్కార ధోరణి పారిశ్రామిక వేత్తలను ఆకట్టుకోవడంతో పాటు, రాష్ట్రంపై పెట్టుబడిదారుల నమ్మకాన్ని రెట్టింపు చేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

మారిన శైలి : మరోవైపు మంత్రి లోకేశ్ తాజా వ్యాఖ్యలు ఆయన ప్రసంగం తీరులో స్పష్టమైన మార్పును సూచిస్తోందని అంటున్నారు. ఇప్పటికే తన బాడీ లాంగ్వేజ్ ను పూర్తిగా మార్చేసుకుని అందరినీ ఆకర్షించిన మంత్రి లోకేశ్ ఇప్పుడు మంచి వ్యాఖ్యాతగా కూడా మెరుగు పడే ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు. తన రాజకీయ ప్రసంగాల్లో పంచ్ డైలాగులు పేల్చుతూ కేడర్ ను ఉర్రూతలూగించిన విధంగానే.. అధికారిక పర్యటనలు, పెట్టుబడులు తీసుకువచ్చే ముఖ్యమైన సమావేశాలలో కూడా మాట తీరుతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు. ఇందులో భాగంగానే డోలో 650 వంటి పదాలను ప్రయోగిస్తూ తనతో సమావేశం పారిశ్రామికవేత్తలకు ఒక మరుపురాని సంఘటనగా మిగిలిపోయేలా నడుచుకుంటున్నారని వ్యాఖ్యానిస్తున్నారు.

ఈసీ వర్సెస్ విపక్షం...బీజేపీకి షాక్ ఇచ్చేలా జగన్ !

కామెంట్స్ వచ్చాయి. తమిళనాడులో టీవీకే స్పందన తెలియాల్సి ఉంది. అయితే అనూహ్యంగా ఏపీ నుంచి విపక్షంలో ఉన్న వైసీపీ ఈసీ వివాదం నేపథ్యంలో ఘాటైన వ్యాఖ్యలు చేయడమే కాదు ఏకంగా దేశంలోని జాతీయ ప్రతిపక్షాలు కూడా చేయని చట్ట సవరణ డిమాండ్ ని కేంద్ర ప్రభుత్వం ముంచు పెట్టి బిగ్ షాక్ ఇచ్చింది. వైసీపీ అధినేత సుదీర్ఘమైన ట్వీట్ చేయడం ద్వారా ఈసీ తీరు మీద తమ పార్టీ రియాక్షన్ ఏంటో చెప్పారు.

ఆ చట్టంలో మార్పులు :ఇదిలా ఉంటే 2023లో చేసిన చట్టంలో మార్పులు తప్పనిసరిగా చేయాలని జగన్ డిమాండ్ చేయడం విశేషం. అప్పట్లో వైసీపీ మద్దతు ఇచ్చిన ప్రధాన ఎన్నికల కమిషనర్- ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకం- పదవీకాలం- చట్టం, 2023ని ఇప్పటి పరిస్థితుల నేపథ్యంలో మళ్లీ సమీక్షించాలని జగన్ కోరారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం అధికార పార్టీ చొరవ తీసుకుని అందరిలో ప్రస్తుతం ఉన్న భయాలను తొలగించి సరైన విధానాన్ని అమలు చేయాలని చెప్పారు. ప్రతిపక్ష నాయకుడు భారత ప్రధాన న్యాయమూర్తి ప్రధాన మంత్రి సభ్యులుగా ఉండే ముగ్గురు సభ్యుల కమిటీ ద్వారా ఎన్నికల కమిషనర్‌ను నియమించేలా ఈ చట్టానికి సవరణ తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక పరీక్ష రాసే విద్యార్థిని పరీక్షాధికారిని నియమిస్తే ఆ అధికారి ఎంత నిజాయితీపరుడైనప్పటికీ ఆరోపణలు వచ్చే అవకాశం ఉంటుందని జగన్ వ్యాఖ్యానించారు. అందువల్ల ఈ మొత్తం ప్రక్రియను తటస్థ వ్యక్తులతో కూడిన వ్యవస్థతో మార్చడం ఎల్లప్పుడూ మంచిదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విధంగా చేయడం వల్ల ఎన్నికల సంఘం పట్ల ప్రజలలో గౌరవాన్ని విశ్వాసాన్ని ఖచ్చితంగా పునరుద్ధరిస్తుందని ఆయన అన్నారు.

ప్రజలకు విశ్వాసం :దేశంలో రాజ్యాంగ వ్యవస్థల పట్ల ప్రజలకు పూర్తి విశ్వాసం ఉండాలంటూ జగన్ ఘాటు కామెంట్స్ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం నిలబడుతుందని ఆయన అన్నారు. అంతే కాదు ఎన్నికల సంఘం నిర్ణయాల మీద ఈసీలో ఉన్న ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న జాతీయ మీడియా కథనాలను జగన్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. అలాగే ఓటర్ల జాబితాల నిర్వహణపైన కూడా అనేక సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న జాతీయ మీడియా కథనాలు ప్రజల్లో తీవ్రమైన ప్రశ్నల సందేహాలను రేకెత్తించాయని ఆయన చెప్పారు. ఓటర్ల జాబితాలో పేర్లను చేర్చడం, తొలగించడం లేదా పునరుద్ధరించడం వంటి విషయాలలో ఏయే అభ్యంతరాలు నమోదయ్యాయి, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు, రాజ్యాంగ వ్యవస్థ ఎంత పారదర్శకంగా పనిచేసింది అనే అంశాలపై ప్రజలకు స్పష్టత అవసరం అని జగన్ నొక్కి చెప్పారు. అందువల్ల ఈ విషయాలపై ప్రజలకు భరోసా కల్పించే ఈసీ తక్షణం చర్యలు చేపట్టాలని కోరారు.

ఓటు హక్కు రక్షించాలి :దేశంలో జరిగే ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని మరింతగా బలోపేతం చేయాలని, అలాగే ప్రతి పౌరుడి ఓటు హక్కును రక్షించాలని ఆయన అభిప్రాయపడ్డారు ప్రజలు నిర్భయంగా ఆ హక్కును వినియోగించుకునే విధంగా వ్యవస్థలను పటిష్టం చేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో పారదర్శకత ఉండటమే కాదని అది కచ్చితంగా ఉన్నట్లుగా ప్రజలకు కనిపించాలని జగన్ కోరారు. ఇదిలా ఉంటే ఏపీలో కూడా సర్ ప్రక్రియను కూటమి ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని జగన్ ఆరోపించారు. వైసీపీ అనేక సందర్భాలలో చేసిన విజ్ఞప్తులను పట్టించుకోలేదని జగన్ అన్నారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో కూడా డివిజన్ల పునర్విభజన తీరుపై ప్రతిపక్ష పార్టీగా వైసీపీ వ్యక్తం చేసిన అభ్యంతరాలను తోసిపుచ్చారని ఆయన నిందించారు. ఇటువంటి చర్యలు ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిస్సందేహంగా బలహీనపరుస్తాయని అన్నారు.

తగ్గిన టీడీపీ విరాళాలు.. అధికారంలోకి వచ్చాక ఆసక్తికర పరిణామం!

అందించింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్ కేంద్రంగా పనిచేస్తున్న వీపీఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.5 కోట్లు ఇవ్వగా, ఎంపీ సానా సతీశ్‌బాబు రూ.1.16 కోట్లు విరాళమిచ్చారు. వీరితో పాటు హైదరాబాద్ బండ్లగూడ జాగీర్‌కు చెందిన సీఎన్ఏపీఎస్ ఇంటెలిక్యాడ్ ప్రైవేట్ లిమిటెడ్, కర్నూలుకు చెందిన శ్రీరాయలసీమ హైస్ట్రెంత్ హైపో లిమిటెడ్ సంస్థలు చెరో కోటి రూపాయలు విరాళంగా అందజేశాయి.

తగ్గుతున్న విరాళాల సరళి..గత గణాంకాలతో పోలిస్తే టీడీపీకి అందుతున్న విరాళాలు తగ్గుముఖం పట్టాయి. 2023-24లో పార్టీకి రూ.100 కోట్లు రాగా, 2024-25లో రూ.83 కోట్లు వచ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025-26) అది రూ.58.25 కోట్లకు తగ్గింది. 2023-24తో పోలిస్తే దాదాపు సగానికి సగం, 2024-25తో పోలిస్తే రూ.25 కోట్ల మేర విరాళాలు తగ్గాయి.

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత విరాళాలు తగ్గడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కాగా, ఈ ఏడాది నిర్వహించిన మహానాడు వేదికగా రెండు రోజుల్లో పార్టీకి రూ.25.61 కోట్ల విరాళాలు అందాయి. ఇందులో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు రూ.5 కోట్లు అందించారు.

కార్యకర్తల సంక్షేమం కోసమే..పార్టీకి విరాళాల రూపంలో వచ్చే నిధులను పూర్తిగా కార్యకర్తల సంక్షేమం కోసమే వినియోగిస్తున్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీలో రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నారు. యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ సహకారంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తూ, వారి పిల్లల చదువుల కోసం ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఉచిత విద్య, ఉపాధి అవకాశాలకు చేయూత అందిస్తున్నారు.

ఒంగోలులో ఘనంగా ఎస్‌వి కార్స్ నూతన షోరూంను ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 26)

ఒంగోలు గుంటూరు రోడ్డు నార్త్ బైపాస్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌వి సెకండ్ కార్స్ షోరూంను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం నిర్వాహకులు అరవపల్లి శ్రీనివాసరావు, విష్ణులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఎస్‌వి కార్స్‌ను కొనుగోలు చేసిన కస్టమర్లకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తన చేతుల మీదుగా వాహనాల కీలను అందజేశారు. కారును స్వయంగా నడిపి నిర్వాహకులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వి కార్స్ యాజమాన్యం మాట్లాడుతూ అతి తక్కువ కిలోమీటర్లు తిరిగిన కార్లు మా దగ్గర అందుబాటులో ఉన్నాయని, మంచి కండిషన్‌తో ఉన్నాయన్నారు. కస్టమర్లు వచ్చి షోరూమ్ సందర్శించి మీకు నచ్చిన కారుని ఫైనాన్స్ రూపంలో గాని తీసుకొని వెళ్ళవచ్చని తెలిపారు, ఈ కార్యక్రమంలో సిబ్బంది, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పైడి శ్రీ స్మారక సభను జయప్రదం చేయండి

దళిత నేత నీలం నాగేంద్రరావు విజ్ఞప్తి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 26)

ఒంగోలులో జరుగు పైడిశ్రీ 13వ స్మారక సభ నీ జయప్రదం చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్ర రావు విజ్ఞప్తి చేశారు. ఒంగోలు గడ్డలగుంట వాసి పైడి తెరేష్ బాబు వాయిద్య కళాకారుడిగా కవిగా రచయితగా ఆల్ ఇండియా రేడియో కళాకారుడిగా సుప్రసిద్ధుడు అన్నారు. దళిత ఉద్యమ ప్రభావంతో మనువాద సాహిత్యానికి వ్యతిరేకంగా దళిత సాహిత్యాన్ని సృష్టించాడన్నారు. అభ్యుదయ కవిత్వాన్ని నిరసిస్తూ దళిత కవిత్వ పంజా విసిరానన్నారు. హైదరాబాద్ లో ప్రముఖ సాహితీ శిఖరం సి నారాయణ రెడ్డి ప్రేరణతో ఉర్దూ గజల్ తో ఉర్రూతలూగించాడు అన్నారు. సమాజంలో దళితుల మీద జరిగే దాడులు మారణకాండలు హత్యాచారాలకి వ్యతిరేకంగా దళితులను ఉత్తేజ పరిచి కవితలు వ్యాసాలు ధీశాలి పైడిశ్రీ అన్నారు. హిందూ సమాజంలో జరుగుతున్న మతతత్వ పోకడలు కులతత్వ వైఖరి అంటరానితనం అణచివేత ఆర్థిక దోపిడీలకు వ్యతిరేకంగా "హిందూ" మహాసముద్రం అను కావ్యం ను రాసి అగ్రకుల కవులకు పక్కలో బల్లెంలా మారడు అన్నారు. అలాగే ఈటీవీ లో ప్రసారమైన విధి సీరియల్ కు స్క్రీన్ ప్లే మాటలు రాసి ప్రేక్షకులను సమ్మోహనం చేసిన పైడి శ్రీ ఏ అన్నారు. ఇటీవల ఒంగోలు 150 సంవత్సరాల వైభవం పేరిట కిమ్స్ హాస్పిటల్ వద్ద ప్రతిష్టించిన 20 విగ్రహాలలో పైడి శ్రీ విగ్రహం కూడా ఒకటన్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు ఒంగోలు ఇండియన్ మెడికల్ హాల్లో జరుగు పైడి శ్రీ అలియాస్ పైడి సురేష్ బాబు స్మారక సభను జయప్రదం చేయాలని, అనేక మంది ప్రముఖ కవులు, రచయితలు ఈ కార్యక్రమానికి విచ్చేస్తున్నారని నీలం నాగేంద్ర రావు తెలిపారు.



50 మందికి రూ.50,50,114ల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణి చేసిన ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, సెప్టెంబర్ 26)

యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎరిక్షన్ బాబు లబ్ధిదారులకు శనివారం పంపిణి చేశారు. 50 మందికి రూ.50,50,114ల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎరిక్షన్ బాబు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎరిక్షన్ బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మున్సిపల్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివి ఎమ్మెల్యే జూలకంటి

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టెంబర్ 24)

పట్టణానికి మున్సిపల్ సిబ్బంది అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. శనివారం స్థానిక మున్సిపాలిటి నందు 30 మంది పర్మినెంట్ మున్సిపల్ సిబ్బందికి ఎమ్మెల్యే చేతుల మీదిగా నూతన యూనిఫాం వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో మున్సిపల్ సిబ్బంది అందించిన సేవలు మరవని అని చెప్పారు. అర్హులైన సిబ్బందికి కచ్చితంగా నివేశ స్థలాలను ముంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, కజ్జం సైదయ్య, కొమెర దుర్గారావు, మద్దిగపు వెంకటరామిరెడ్డి, కంభపాటి అనిల్ కుమార్, బీజేపీ నాయకులు క్రాంతి కుమార్, జనసేన నాయకులు కొమర లాల్ కిషన్, అవినాష్ రెడ్డి, కొమెర శివ, తదితరులు పాల్గొన్నారు.






ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
27.09.26 ఆదివారం

ట్రైనింగ్ తీసుకున్న ప్రతి ఒక్క కానిస్టేబుల్

విధి నిర్వహణలో ప్రజల భద్రతే మీ లక్ష్యం

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
చట్టమే మీ మార్గదర్శి- సత్యం, న్యాయాన్ని నిలబెట్టడం,
ప్రజలకు రక్షణ కల్పించడమే మీ లక్ష్యం
ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు
ఘనంగా ముగిసిన పోలీస్ పాసింగ్ అవుట్ పెరేడ్



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టెంబర్ 26)

ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలోకి సివిల్ కానిస్టేబుళ్లుగా ఎంపికైన 190 మంది స్టైపెండరీ కానిస్టేబుళ్లకు జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో నిరవధికంగా తొమ్మిది నెలల పాటు కఠోర శిక్షణ అనంతరం, ఈరోజు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. అత్యంత వైభవంగా దీక్షాంత్ పరేడ్ నిర్వహించారు. ముందుగా పరేడ్ కమాండర్‌గా ఉన్న మహమ్మద్ రజా పరేడ్‌కు ఆధిక్యం వహించి సమర్థవంతంగా నిర్వహించారు. వేదికపైకి విచ్చేసిన ముఖ్య అతిథి, గౌరవ అతిథులకు శిక్షణ పొందిన కానిస్టేబుళ్లు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పరేడ్ నిర్వహణకు ముఖ్య అతిథి అనుమతి కోరారు. పరేడ్‌ను వీక్షించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో ముఖ్య అతిథి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజుతో కలిసి పరేడ్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్ల యూనిఫామ్, టర్న్‌అవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ తొమ్మిది నెలల కఠినమైన ప్రాథమిక పోలీస్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకుని ప్రజాసేవలోకి అడుగుపెడుతున్న 190 మంది నూతన పోలీస్ కానిస్టేబుళ్లకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 28.11.2022న రాష్ట్రవ్యాప్తంగా 6,100 గ్రామ పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిందని, సుమారు 5 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వివిధ దశల ఎంపిక ప్రక్రియ అనంతరం సుమారు 5,800 మంది ఎంపికైనట్లు తెలిపారు. శిక్షణార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నెలవారీ స్టైపెండ్‌ను రూ.4,500 నుంచి రూ.12,000కు పెంచడం జరిగిందని పేర్కొన్నారు. ఒంగోలు జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో 22.12.2025న ప్రారంభమైన ఈ బ్యాచ్‌లో మొత్తం 198 మంది శిక్షణార్థులకు శిక్షణ కేటాయించగా, 193 మంది రిపోర్ట్ అయ్యారని, వివిధ ఉద్యోగాలకు ఎంపికైన ముగ్గురిని మినహాయించి ప్రస్తుతం 190 మంది శిక్షణార్థులు పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొంటున్నారని తెలిపారు. వీరంతా పూర్వపు తూర్పుగోదావరి జిల్లాకు చెందినవారని పేర్కొన్నారు. ఈ బ్యాచ్‌లో పీజీ 16 మంది, బీటెక్ 34 మంది, డిగ్రీ 121 మంది, ఇంటర్మీడియట్ 19 మంది ఉన్నారని తెలిపారు. ఉన్నత విద్యార్హతలు కలిగిన యువత పోలీస్ శాఖలో చేరడం అభినందనీయమని, విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూనే భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. "పోలీస్ యూనిఫాం అధికారం కోసం కాదు.. బాధ్యత కోసం". ప్రతి పౌరుడితో గౌరవంగా, బాధితులతో సానుభూతితో వ్యవహరిస్తూ, చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయాలని సూచించారు. తొమ్మిది నెలల శిక్షణతో అభ్యాసం పూర్తయిందని భావించకుండా, మారుతున్న నేరాల నేపథ్యంలో సైబర్ క్రైమ్, డిజిటల్ టెక్నాలజీ, ఆధునిక దర్యాప్తు పద్ధతులపై నిరంతరం అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. నిజాయితీని బలంగా, క్రమశిక్షణను అలవాటుగా, చట్టాన్ని మార్గదర్శకంగా, ప్రజాసేవను లక్ష్యంగా చేసుకుని విధులు నిర్వహించాలని నూతన కానిస్టేబుళ్లకు సూచించారు. నిత్యం ధ్యానం చేయడం వలన మనసు ప్రశాంతంగా, నిలకడగా ఉంటుందని, తద్వారా నేరాలను గుర్తించడంలో ఏకాగ్రత పెరగడంతో పాటు, ఆరోగ్యంగా ఉంటే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని అన్నారు. ఈ స్థాయికి చేరుకోవడంలో తల్లిదండ్రుల త్యాగాలు, ఆశీస్సులు ఎంతో ముఖ్యమైనవని, వాటిని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని తెలిపారు. నూతన కానిస్టేబుళ్లు తమ సేవా ప్రయాణంలో అంకితభావంతో పనిచేసి, వారి కుటుంబాలకు, పోలీస్ శాఖకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ గారు ఆకాంక్షించారు. ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి ట్రైనింగ్ అనేది జీవితం లో ముఖ్యమైన భాగమని అన్నారు. మంచి నాయకత్వం కల్గిన జిల్లా ఎస్పి హర్షవర్ధన్ రాజు అధ్వర్యంలో మంచి నైపుణ్యం కలిగిన కమాండర్లతో కానిస్టేబుల్స్ ట్రైనింగ్ తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా ఇప్పుడు ఉన్న పరిస్థితిని బట్టి ప్రతిఒక్క పోలీసు సిబ్బందికి మెడిటెషన్ ట్రైనింగ్ కూడా చాలా ముఖ్యమన్నారు. మెడిటెషన్ ట్రైనింగ్ కూడా ఇవ్వాలని నేను కొరుకుంటున్నన్నారు. ఇలాంటి ట్రైనింగ్ ఇచ్చినప్పుడే ఎంతటి క్రైం ఇన్వెస్టిగేషన్ అయిన ఇట్టే ఛేదించగలని తేలియచేశారు. మనలో వత్తిడి లేన్నప్పుడే ఎంత పెద్ద సమస్య అయిన ఇట్టే ఛేదించవచ్చన్నారు.

ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ ట్రైనింగ్ పూర్తి చేసుకుని రియల్ లైఫ్ లో అడుగుపెట్టడం సంతోషంగా ఉందని క్రమశిక్షణతో కూడిన జీవితం గడిపితేనే మీరు చేస్తున్న ఉద్యోగానికి వన్నెతెచ్చి ప్రభుత్వానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన అన్నారు. న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే పేదల పట్ల, మహిళలు పట్ల, చిన్నారులను గౌరవించే విధంగా ఉండాలన్నారు. రాబోయే కాలంలో ప్రతిఒక్కరూ టెక్నాలజీ తో పోటిపడాలని, టెక్నాలజీని ఉపయోగిస్తేనే అనేక కేసులు ఛేదిస్తామని, యువ కానిస్టేబుల్ టెక్నాలజీ పై ప్రత్యేక దృష్టి పెటాల్సిన అవసరం చాలా ఉందన్నారు. ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ ఒంగోలు డీటీసీలో ప్రస్తుత బ్యాచ్‌కు చెందిన పూర్వపు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 190 మంది ఎస్‌సిటిపిసి లకు తొమ్మిది నెలల పాటు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన శిక్షణ అందించినట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా చట్టాలు, క్రిమినల్ లాస్, లా అండ్ ఆర్డర్, ఫిజికల్ ఫిట్‌నెస్, పరేడ్ డ్రిల్, ఆయుధాల వినియోగం, ట్రాఫిక్ నియంత్రణ, స్విమ్మింగ్, డ్రైవింగ్‌తో పాటు సైబర్ క్రైమ్, ఫోరెన్సిక్ సైన్స్, డిజిటల్ ఎవిడెన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి ఆధునిక పోలీసింగ్ అంశాల పై కూడా శిక్షణ అందించినట్లు తెలిపారు. మొబైల్ పోలీస్ అప్లికేషన్ల వినియోగం పై ▶4లో



స్థానిక ఎన్నికలకు ఎన్డీఏ కూటమి సమాయత్తం సమన్వయంతో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

4

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్ సమీక్షా సమావేశం



అర్హులైన ప్రతీ నిర్వాసితుడికి పరిహారం అందిస్తాం

జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టెంబర్ 26)

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులు, వారి పునరావాస, పరిహారం (ఆర్ అండ్ ఆర్) చెల్లింపుల ప్రక్రియ పై మార్కాపురం కలెక్టరేట్‌లో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధ్యక్షతన ఈ సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ▶4లో

అన్ని వర్గాల డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా

నగరంలో రూ.3.40 కోట్లతో నిర్మించిన ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఎస్ఈ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టెంబర్ 26)

అన్ని వర్గాల డిమాండుకు అనుగుణంగా విద్యుత్ సరఫరాపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. ఒంగోలు నగరంలో రూ.3.40 కోట్లతో నిర్మించిన ట్రాన్స్ మిషన్ కార్పొరేషన్ ఎస్ఈ కార్యాలయాన్ని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధనరావు, బి ఎన్ విజయ్ కుమార్, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారిలతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, నాణ్యమైన సరఫరా కోసం ట్రాన్స్మిషన్ వ్యవస్థ బలోపేతానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ఒంగోలులోని సర్కిల్ కార్యాలయాన్ని ఏడాదిన్నరలో నిర్మించామన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత 132/220/400 కేవీ సబ్ స్టేషన్లను నిర్మిస్తోందన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం రూ. 6 వేల కోట్లతో సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5 సబ్ స్టేషనులను నిర్మిస్తున్నామని, నాలుగైదు నెలల్లోనే వీటిని ప్రారంభిస్తామన్నారు. రైతులకు సత్వరమే ▶4లో

మార్కాపురం జిల్లాను 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దుతాం



జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత
రాయలసీమ రైజింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా జిల్లాలో హార్టికల్చర్ అభివృద్ధికి శ్రీకారం
రూ.1,00,000 కోట్ల హార్టికల్చర్ ప్రాజెక్ట్‌లో జిల్లా చేర్చడం చారిత్రాత్మకం
వెలిగొండ జలాలు, హార్టికల్చర్‌తో మారనున్న జిల్లా ముఖచిత్రం

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టెంబర్ 26)

ముఖ్యమంత్రి అక్టోబర్ 2న ప్రారంభించనున్న 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్', 'రాయలసీమ రైజింగ్' కార్యక్రమాలు మార్కాపురం జిల్లా సమగ్ర అభివృద్ధికి సరికొత్త దిశను చూపుతాయని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత వెల్లడించారు. నవనిర్మాణ దిశగా వేస్తున్న ఈ అడుగు మన జిల్లా అభివృద్ధికి అతిపెద్ద 'గేమ్ ఛేంజర్' కానుందని ఆమె ఉద్ఘాటించారు. నేటి నుండి ప్రారంభమైన కర్టెన్ రైజర్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కలెక్టర్ ఎం విజయ సునీత మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా హార్టికల్చర్ రంగానికి రూ. 1,00,000 కోట్ల పెట్టుబడులు రానున్నాయని, ఇందులో కేంద్ర ప్రభుత్వ సహకారంతో దాదాపు రూ. 40,000 కోట్లు ముఖ్యమంత్రి తీసుకువచ్చారని తెలిపారు. రాయలసీమ జిల్లాలతో పాటు కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లాను కూడా ఈ ప్రాజెక్ట్‌లో చేర్చడం ఎంతో శుభపరిణామమని కలెక్టర్ అన్నారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 47,000 హెక్టార్ల హార్టికల్చర్ సాగు విస్తీర్ణానికి అదనంగా మరో 63,000 హెక్టార్లను చేర్చడం ద్వారా మొత్తం విస్తీర్ణాన్ని 1,11,000 హెక్టార్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో గుర్తించిన 6 క్లస్టర్లలో మొదటి ఏట యెర్రగొండపాలెం క్లస్టర్‌ను టేక్ అప్ చేస్తున్నామని వివరించారు. రాబోయే మూడేళ్లలో జిల్లాలో ప్రొడక్షన్ ప్రస్తుతం ఉన్న 10 లక్షల టన్నుల నుండి 15 లక్షల టన్నులకు (అదనంగా 7.75 లక్షల మెట్రిక్ టన్నులు) పెరుగుతుందని, అలాగే జివిఏ రూ. 5,183 కోట్ల నుండి రూ. 7,896 కోట్లకు చేరి రైతులకు దాదాపు రూ. 2,713 కోట్ల అదనపు ప్రయోజనం కలుగుతుందని ▶4లో

ట్రైనింగ్ తీసుకున్న ప్రతి ఒక్క కానిస్టేబుల్ విధి నిర్వహణలో ప్రజల భద్రతే మీ లక్ష్యం










శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకునే విధంగా శిక్షణార్థులను తీర్చిదిద్దినట్లు తెలిపారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బెస్ట్ ఇండోర్‌గా ఛెస్ట్ నంబర్ 13 పి ప్రశాంత్, బెస్ట్ అవుట్‌డోర్‌గా ఛెస్ట్ నంబర్ 45 జి రవి, బెస్ట్ ఫైరర్‌గా ఛెస్ట్ నంబర్ 162 కె రామకృష్ణ, బెస్ట్ ఆల్ రౌండర్‌గా ఛెస్ట్ నంబర్ 13 పి ప్రశాంత్ నిలిచినట్లు తెలిపారు. వారిని ఎస్పీ గారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ బ్యాచ్‌లో పీజీ, బీటెక్, డిగ్రీ వంటి ఉన్నత విద్యార్హతలు కలిగిన వారు కూడా ఉన్నారు. ప్రతి ఒక్కరూ తమ విద్యార్హతలకు అనుగుణంగా జ్ఞానాన్ని, నైపుణ్యాలను మరింత పెంపొందించుకుంటూ, పోలీస్ శాఖలో అంకితభావంతో విధులు నిర్వహించాలని కోరుకుంటున్నాను. ప్రస్తుత బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూనే, భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు సాధించే దిశగా కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రజల భద్రతే ధ్యేయంగా, ప్రజాసేవే కర్తవ్యంగా భావించి, క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధత, ధైర్యసాహసాలతో విధులు నిర్వహించాలని నూతన కానిస్టేబుళ్లకు జిల్లా ఎస్పీ సూచించారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ, బాధితుల సమస్యలను సానుభూతితో విని, చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. పోలీస్ శాఖలో చేరడం కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ అనే గొప్ప బాధ్యతను స్వీకరించడమని ఎస్పీ పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడంతో పాటు, ప్రజల విశ్వాసాన్ని కూడా కాపాడాలని సూచించారు. నూతన కానిస్టేబుళ్లు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ పోలీస్ శాఖకు, శిక్షణా కేంద్రానికి, వారి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ సమసమాజం కోసం ట్రైనింగ్ పూర్తి చేసుకున్న ప్రతిఒక్క కానిస్టేబుల్ కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎర్పాటు అయిన దగ్గర నుంచి కీలకమైన డిపార్ట్మెంట్‌లో ప్రభుత్వం నూతనంగా నోటిఫికేషన్ ఇచ్చి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. ప్రజా సేవలో అడుగుపెట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. మీరు చేసే సేవ మీ కుటుంబ తోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా గౌరవం తీసుకురావాలన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం రావాలని ప్రతి ఒక్కరూ అశపడతారని రావడం మీ అందరూ ట్రైనింగ్ పూర్తి చేసుకుని పోలీసు కానిస్టేబుల్‌గా విధి నిర్వహణలోకి అడుగుపెట్టడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఒక కేసు జరిగినప్పుడు మొదట అక్కడకు వెళ్ళేది మీరే అని, మీరు ఇచ్చే సమాచారంతోనే కేసు ఇన్వెస్టిగేషన్ ముందుకు సాగుతుందన్నారు. మీరు నీతి నిజాయితీగా పని చేస్తే కేసు నిలబడుతుందని గుర్తు చేశారు. నీతి నిజాయితీగా పని చేసి ఇంకా ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే ఆ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ కంట్రోల్‌లో ఉంటేనే ఆ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో మీ అందరూ భాగస్వాములు అవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) యుగంధర్‌బాబు, ఏఎస్పీ (ఏఆర్) జి నాగేశ్వరరావు, డిఎస్పీ (ఏఆర్) శ్రీనివాసరావు, డిటిసి డిఎస్పీ గురునాధ్ బాబు, ఒంగోలు డిఎస్పీ శ్రీనివాసరావు, ఎస్‌బి సీఐ శ్రీనివాసరావు, డిటిసి సీఐ పాండురంగారావు, డిటిసి ఆర్ఐ ఓ రవికుమార్, ఆర్ఐ (అడ్మన్) రమణారెడ్డి, ఆర్ఐ వెల్ఫేర్ సితారామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు ఎన్డీఏ కూటమి సమాయత్తం
సమన్వయంతో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టంబర్ 26)

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని టీడీపీ, జనసేన, బీజేపీ ఎన్డీఏ కూటమి ఉమ్మడి ప్రకాశం జిల్లా సమన్వయ కమిటీ సమావేశం ఒంగోలులోని ఎంపీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు.

సమావేశానికి ముఖ్య అతిథులుగా ప్రకాశం జిల్లా ఇన్‌చార్జి, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా ఎన్నికల పరిశీలకులు, శాసనమండలి సభ్యులు బీటీ నాయుడు హాజరయ్యారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్‌రావు, బిఎన్ విజయ్‌కుమార్, ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, ఎర్రగొండపాలెం ఇంచార్జ్ గూడూరు ఎరిక్షన్ బాబు, దర్శి ఇంచార్జ్ గొట్టిపాటి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. జనసేన, బీజేపీ నాయకులు, కూటమి నేతలు కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సమన్వయంతో పనిచేసి మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్డీఏ కూటమిలోని మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఎన్నికల రిజర్వేషన్లపై ఎన్నికల కమిషన్ నుంచి అధికారిక గెజిట్ వెలువడిన అనంతరం వాటి ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మూడు పార్టీల నాయకులు పరస్పరం చర్చించుకుని సమన్వయంతో అభ్యర్థులను ఎంపిక చేసే విధంగా ముందుకు సాగుతారని తెలిపారు. రిజర్వేషన్లు, అభ్యర్థుల ఎంపికకు సంబంధించి తుది నిర్ణయాలు రాష్ట్ర స్థాయి కూటమి నాయకత్వం సూచనల మేరకు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో కూటమి సమన్వయమే కీలకమన్నారు. మూడు పార్టీల నాయకులు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. రిజర్వేషన్ల అనంతరం అభ్యర్థుల ఎంపికపై నిర్ణయం ఉంటుందన్నారు. రాష్ట్ర నాయకత్వం సూచనల మేరకే తుది నిర్ణయాలు ఉంటాయని తెలిపారు.

అన్ని వర్గాల డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా

ట్రాన్స్ఫార్మర్లు ఇస్తున్నామన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ వినియోగం అమాంతం పెరిగిందని, అయినా ఉత్పత్తి, సరఫరాలో ఎలాంటి ఇబ్బందీ కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జెన్కో వ్యవస్థను బలోపేతం చేసి నిరంతరాయ విద్యుత్ అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. విద్యుత్ డిమాండ్ అధికంగా ఉంటే తక్కువ ధరకు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలుకు ఆదేశించినట్లు తెలిపారు. విద్యుత్ డిమాండ్ ను అందుకునేందుకు పునరుత్పాదక ఇంధన వనరులను కూడా వినియోగించుకుంటున్నామన్నారు. బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్ ద్వారా పీక్ అవర్స్ లో విద్యుత్ డిమాండ్ ను అందుకోగలుగుతున్నామని, పీఎం సూర్యఘర్ త్వరగా పూర్తి చేసినట్లయితే కొంతమేర విద్యుత్ డిమాండ్ తగ్గుతుందని వివరించారు. సూర్యఘర్ పథకం కింద రాష్ట్రంలో 20 లక్షల కనెక్షన్ల లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఐదు లక్షల కనెక్షన్లు ఇచ్చినట్లు చెప్పారు. ఒంగోలులో స్మార్ట్ సిటీకి అవరోధం లేకుండా విద్యుత్ లైన్లు మార్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ సమయం మాదిరిగానే విద్యుత్ కూడా ఎంతో విలువైనదన్నారు. వృధా చేయకుండా వాడుకోవాలని ప్రజలకు సూచించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వలన ప్రజలకు మెరుగైన విద్యుత్ లభిస్తున్నట్లు చెప్పారు. ఒంగోలు లో ఇప్పటికే ఒక సబ్ స్టేషన్ ప్రారంభించామని, కొత్తపట్నం సబ్ స్టేషన్ ను కూడా త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. స్మార్ట్ సిటీ పైన ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్లను మార్చేందుకు ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రాజగోపాల్ నాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.




మార్కాపురం జిల్లాను 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దుతాం

కలెక్టర్ పేర్కొన్నారు. మైక్రో ఇరిగేషన్ ద్వారా జిల్లాలో అదనంగా 68,820 హెక్టార్ల విస్తీర్ణాన్ని సాగు పరిధిలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నేటి నుండి ప్రారంభమైన కర్టెన్ రైజర్ ప్రోగ్రామ్‌తో పాటు అక్టోబర్ 2 నుండి 5వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా విస్తృత ఔట్‌రీచ్, రైతు మొబిలైజేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. రైతులకు, పాఠశాల, కళాశాల విద్యార్థులకు హార్టికల్చర్ సాగు విధానాల పై అవగాహన కల్పించడంతో పాటు కళాజాతాలు, ట్రాక్టర్ ర్యాలీలు, మారథాన్‌లు, రంగోలీ పోటీల ద్వారా చైతన్యం తెస్తామన్నారు. అక్టోబర్ 2వ తేదీన జరిగే ప్రధాన కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా జిల్లాలోని ప్రతి రైతుకూ వీక్షించేలా ఏర్పాట్లు చేశామని, ఈ బృహత్తర కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు సమర్థవంతంగా భాగస్వాములై విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం విజయ సునీత పిలుపునిచ్చారు.సెకండ్ ఫైల్‌లో
వచ్చిన వార్తను మరియు ఫొటోను ఐటమ్ నెం. 118కి ఈ వార్తను వాడుకోగలరు.

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్ సమీక్షా సమావేశం




మాట్లాడుతూ ప్రాజెక్టు వల్ల ఇళ్లను, స్థలాలను కోల్పోయిన అర్హులైన నిర్వాసితులందరికీ పూర్తి స్థాయిలో న్యాయం చేయడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కోసం మొత్తం రూ.906 కోట్లు మంజూరు చేసిందని, ఒరిజినల్ డాక్యుమెంట్స్ పరిశీలన పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నిధుల విడుదల, క్షేత్రస్థాయి వెరిఫికేషన్ వివరాలను జిల్లా కలెక్టర్ వివరంగా వెల్లడించారు. ఇప్పటికే దాదాపు రూ.758.31 కోట్ల పరిహారం అందించడం జరిగిందని పేర్కొన్నారు. జీఓ ఆర్టి నెం.489, 30.8.2026 మేరకు 1,009 మంది మిస్సింగ్ కేటగిరీ కింద మొత్తం 2,998 మంది జాబితాను రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చిన 5 డిప్యూటీ కలెక్టర్ల బృందం దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిందని వివరించారు. ప్రాథమిక విచారణ చేసి 721 మందిని అర్హులుగా నివేదిక ఇవ్వగా, ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆన్‌లైన్ వెరిఫికేషన్ పూర్తి చేసి శుక్రవారం సాయంత్రం నాటికి 708 మంది అర్హులుగా తుది సంఖ్యను తేల్చారని పేర్కొన్నారు. స్టేట్ టీమ్స్‌చే 321 మంది పరిశీలన పూర్తయిందని, డ్యూప్లికేషన్లు తొలగించాక నిన్నటి వరకు నిర్వహించిన వెరిఫికేషన్‌లో 11 మంది మాత్రమే అర్హులుగా తేలారని తెలిపారు. (కలనూతల, సుంకేసుల వంటి గ్రామాల కేసులు పరిశీలనలో ఉన్నాయని పేర్కొన్నారు). దాదాపు 90% వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయిందని, అర్హుల జాబితాను ఆదివారం ఉదయం తాసిల్దార్ ఆఫీసుల్లో ప్రదర్శించడం జరుగుతుందని వెల్లడించారు. ఎఅర్హత లేనివారు లబ్ధిదారులుగా రాకూడదని, నిజమైన అర్హులు నష్టపో కూడదనే ఉద్దేశంతోనే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి పేమెంట్లు పొందేందుకు ప్రయత్నించిన కొన్ని కేసులను (ఉదాహరణకు తప్పుడు పదవ తరగతి సర్టిఫికెట్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పెళ్లయిన అమ్మా యిల సమాచారం దాచడం, ఇతరుల ఫోటోలతో పాస్‌బుక్‌లు చూ పించడం) విచారణలో గుర్తించినట్లు కలెక్టర్ చెప్పారు. గ్రామస్థులు ఒక బృందంగా ఏర్పడి గ్రామాల్లో నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఏవైనా తప్పుడు పేర్లు జాబితాలోకి వచ్చినా లేదా అర్హులైన వారి పేర్లు మిస్ అయినా వెంటనే అధికా రుల దృష్టికి తెచ్చి రీ-చెకింగ్ చేయించుకోవచ్చని సూచించారు. నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని, తప్పుడు క్లెయిమ్‌లను ఎట్టి పరిస్థితు ల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. ప్రత్యేక బృందాల ద్వారా పునరావాస గ్రామాల పరిశీలన పూర్తయిందని, త్వరలోనే తుది జాబితాను ప్రదర్శించి అర్హులైన అందరి ఖాతాల్లోకి నిధులు జమ చేసేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నామని స్పష్టం చేశారు. నిర్వాసితుల పునరావాస కాలనీలలో అవసరమైన అన్ని ప్రాథమిక సౌకర్యాలు కల్పిస్తున్నామని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇప్పటివరకు చేపట్టిన దరఖాస్తుల పరిశీలన, ఆన్‌లైన్ వెరిఫికేషన్ వివరాలను సమగ్రంగా వివరించారు. ప్రాజెక్టు ద్వారా ప్రభావిత మైన కుటుంబాల వివరాలను వెల్లడిస్తూ మొత్తం నిర్వాసితుల కుటుంబాలలో 3,589 కుటుంబాలు వన్-టైమ్ సెటిల్‌మెంట్‌కి ఎంపిక చేసుకోగా, 3,732 కుటుంబాలు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కోసం దరఖాస్తు చేసుకున్నాయని తెలిపారు. 1,989 ఆర్ అండ్ ఆర్ ప్రతిపాదనలు, ఇతర కేటగిరీల కింద డిప్యూటీ కలెక్టర్ల బృందాలు చేసిన క్షేత్రస్థాయి విచారణ వివరాలను, బిల్లుల ఆమోదం పొందే క్రమాన్ని వెల్లడిం చారు. అనంతరం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ దశాబ్దాలుగా త్యాగం చేసిన నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన నష్టపరిహారం వేగంగా చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. అసలైన లబ్ధిదారులకు అన్యాయం జరగకుండా, అనర్హులు జాబితాలోకి రాకుండా అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థుల సహకారంతో జాబితాను ఖరారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల అధికారులు, నిర్వాసిత గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

బద్వేల్‌లో మార్మోగిన ‘వందేమాతరం’

ఘనంగా 150వ వందేమాతర వేడుకలు

శ్రీ సరస్వతీ శిశు మందిరంలో ‘నమామి భారతం - వందేమాతరం’ సామూహిక గానం

పాల్గొన్న ప్రముఖులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు





(షణ్ముఖ వెలుగు, బద్వేల్, సెప్టెంబర్ 26)

విద్యా భారతి అఖిల భారతీయ విద్యా సంస్థాన్ పిలుపుమేరకు కడప విభాగ్, అనంతపురం సమితి ఆధ్వర్యంలో బద్వేల్ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిరంలో శనివారం 150వ వందేమాతర వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్వహించిన “నమామి భారతం – వందేమాతరం సామూహిక గానం” కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని దేశభక్తి గీతాన్ని ఆలపించారు. వందేమాతర నినాదాలతో పాఠశాల ప్రాంగణం మార్మోగింది. ఈ జాతీయ స్థాయి విశేష కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్.కె.పి.జడ్.పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాజులపల్లి వెంకట సుబ్బారెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సి రామకోటి రాజు విచ్చేశారు. అలాగే, ఈ వేడుకలలో కడప విభాగ్ కార్యకారిణి సభ్యులు కొండపల్లి వెంకట సుభాష్ కుమార్, సంచాలిత సమితి కార్యదర్శి బోలా నారాయణ, పాఠశాల కార్యదర్శి పెద్ది సుధాకర్, సంచాలిత సమితి మాజీ అధ్యక్షులు తులసి శివానంద గౌరవ అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. జాతీయ భావాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు నేటి తరానికి ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు, పోషకులు, పత్రికా విలేకరులు, స్థానిక శ్రేయోభిలాషులు విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా జయప్రదం చేశారు.

అంతర్జాతీయ ప్రమాణాలకు ధీటుగా నూతన టర్మినల్ భవన నిర్మాణ పనులు చేపట్టాలి

భారత పౌర విమానయాన శాఖ కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కింజరాపు జిల్లా మంత్రి, జిల్లా కలెక్టర్‌లతో కలిసి కడప ఎయిర్ పోర్ట్ నూతన టర్మినల్ భవన పనుల పురోగతి పరిశీలన







(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, సెప్టెంబర్ 26)

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అధునాతన సౌకర్యాలతో అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పాటిస్తూ కడప ఎయిర్ పోర్ట్ నూతన టర్మినల్ భవన నిర్మాణ పనులను పూర్తిచేయాలని.. భారత పౌర విమానయానశాఖ కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కింజరాపు ఎయిర్ పోర్ట్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కడప ఎయిర్ పోర్ట్ ప్రాంగణంలో నూతన టర్మినల్ బిల్డింగ్ నిర్మాణ పనుల పురోగతిని భారత పౌర విమానయాన శాఖ కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కింజరాపు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖామంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి ఎస్ సవిత, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, రాజ్యసభ సభ్యులు సీఎం సురేష్ నాయుడు, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేసీ డాక్టర్ నిధీమీనా, ఎయిర్ పోర్ట్ అథారిటీ ప్లానింగ్ హెడ్ అనిల్ గుప్త, ఎయిర్ పోర్ట్ అథారిటీ రీజినల్ డైరెక్టర్ ఆచార్య మధుసూదన్, ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ సుజిత్ కుమార్ పోదర్, జిల్లా నాయకులు భూపేష్ రెడ్డి, మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎయిర్ పోర్ట్ టర్మినల్ భవన నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పౌర విమానయాన సేవారంగంలో ప్రయాణీకుల అనుభవాలు, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని భారతీయ విమానాశ్రయాలను ఉన్నత ప్రమాణాలతో అంతర్జాతీయ స్థాయికి దీటుగా నూతన టెర్మినల్ భవన నిర్మాణాలను పటిష్టంగా చేపట్టాలన్నారు. నూతన డొమెస్టిక్ టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణ పనులను అత్యంత నాణ్యతతో, భద్రతా ప్రమాణాలతో అంతర్జాతీయ ప్రమాణాలకు ధీటుగా అన్ని రకాల అధునాతన వసతులతో నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. ఎయిర్ పోర్ట్ నూతన టర్మినల్ భవన నిర్మాణ పనుల్లో భాగంగా పర్యావరణానికి ఎలాంటి అంతరాయం కలగకుండా ఏరో డ్రమ్ నిర్మాణ పనులను చేపట్టేందుకు సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాతూ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని టెర్మినల్‌ను మొదటి, రెండో దశల్లో విస్తరించేందుకు అభివృద్ధి ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ వివరించారు. సిటీ సైడ్ అభివృద్ధి, చేరుకునే రహదారి, పార్కింగ్, సేవా భవనం, అగ్నిమాపక కేంద్రం, విమాన రాకపోకల నియంత్రణ కేంద్రం, ఐసోలేషన్ బే, డీవీఓఆర్, సౌర విద్యుత్ కేంద్రాలకు ప్రణాళికలో స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. కడప–బెంగళూరు, కడప–తిరుపతి, కడప–నెల్లూరు రహదారుల అభివృద్ధితో విమానాశ్రయానికి రహదారి అనుసంధానం మరింత మెరుగుపడుతుందని వివరించారు. 2022–23లో సుమారు 70 వేల మంది మాత్రమే వినియోగించిన కడప విమానాశ్రయాన్ని భవిష్యత్ ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఉడాన్ పథకం కింద ఆధునిక ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రాత్రి వేళల్లోనూ విమానాల రాకపోకలకు వీలుగా నైట్ ల్యాండింగ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని వివరించారు. కడప జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల్లోని సుమారు 25 లక్షల మంది ప్రజలకు ఈ విమానాశ్రయ అభివృద్ధి ప్రయోజనం చేకూరుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. అంతకుముందు కడప విమానాశ్రయాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నామని ఎయిర్‌పోర్ట్ రీజినల్ డైరెక్టర్ ఆచార్య మధుసూదన్ కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రికి పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా పనుల పురోగతిని వరించారు. దాదాపు 80 శాతం మేర నూతన టెర్మినల్ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2024 మార్చి 10న వర్చువల్ విధానంలో దేశవ్యాప్తంగా 14 విమానాశ్రయాల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కడప విమానాశ్రయ నూతన టెర్మినల్‌కు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. సుమారు రూ.266 కోట్ల అంచనా వ్యయంతో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పనులు చేపట్టినట్లు వివరించారు. కడప విమానాశ్రయం మొత్తం 1,110 ఎకరాల విస్తీర్ణంలో ఉందని, 2,515 మీటర్ల పొడవు, 45 మీటర్ల వెడల్పుతో ఉన్న రన్‌వే కోడ్–సి రకం విమానాలకు అనుకూలంగా ఉంటుందని కలెక్టర్ వివరించారు. 16,455 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నూతన టెర్మినల్ భవనాన్ని నిర్మిస్తున్నామని, ఏటా 25 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించేలా, రద్దీ సమయాల్లో గంటకు 1,800 మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యంతో టెర్మినల్‌ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. టెర్మినల్‌లో 24 చెక్–ఇన్ కౌంటర్లు, మూడు ఏరో బ్రిడ్జీలు, రెండు సామాను కన్వేయర్ బెల్టులు, మూడు భద్రతా తనిఖీ యంత్రాలు, 375 కార్ల పార్కింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఏకకాలంలో ఏడు కోడ్–సి విమానాలను నిలిపే సౌకర్యం కూడా అందుబాటులోకి రానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మురళి, రెవెన్యూ, స్థానిక జిల్లా ప్రజాప్రతినిధులు, ఎయిర్ పోర్టు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



అండగా నిలిచిన సాంబన్న క్యాన్సర్ బాధితుడికి రూ.4 లక్షల భరోసా

ఎమ్మెల్యే ఏలూరి చొరవతో సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ మంజూరు



(షణ్ముఖ వెలుగు, మార్టూరు, సెప్టెంబర్ 26)

ప్రాణాంతక వ్యాధితో పోరాడుతూ, అప్పులతో కుంగిపోతున్న ఓ నిరుపేద కుటుంబానికి నమ్మిన నాయకుడి రూపంలో భరోసా లభించింది. మార్టూరు మండలం రాజుగారిపాలేనికి చెందిన దాట్ల విజయరామరాజు క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతూ, చికిత్స ఖర్చులు భరించలేక కుటుంబం మొత్తం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ దీన పరిస్థితిని స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఏలూరి బాధితుడి కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని వెంటనే ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆయన కృషి ఫలించి, గుంటూరులోని కిమ్స్ చక్ర క్యాన్సర్ సెంటర్‌లో చికిత్స కోసం రూ.4,00,000 (నాలుగు లక్షల రూపాయలు) మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) విడుదల చేసింది. తీవ్ర ఆర్థిక భారంతో ఆందోళనలో ఉన్న తమ కుటుంబానికి సకాలంలో అండగా నిలిచిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కు బాధితుడి బంధువులు, స్థానికులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అవసరమైన వేళ ఆదుకున్న సాంబశివరావు రుణం ఎప్పటికీ మరువలేం అని కుటుంబ సభ్యులు భావోద్వేగంతో పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధిగా తనకు అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించి, నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే సాంబశివరావు తెలిపారు. ప్రజల అత్యవసర వైద్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థిక భరోసా కల్పిస్తూ అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల పక్షాన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మురికివాడల్లేని పట్టణాన్ని నిర్మించడమే లక్ష్యం

ఎమ్మెల్యే జూలకంటి

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టెంబర్ 26)





మురికివాడల్లేని మాచర్ల పట్టణాన్ని నర్మించడమే లక్ష్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని 6,7,8,10వ వార్డుల నందు ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేశారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ సరఫరాలు వంటి పలు సమస్యలపై మున్సిపాల్ అధికారులతో సమీక్షించారు. స్థానికులతో మాటామంతి నిర్వహించి. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో చేపట్టిన అమృత్ స్కీం పనులను పరిశీలించారు. 8వ వార్డు నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకును పరిశీలించారు. అనంతరం పలువురుని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు గబ్రూనాయక్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, టీడీపీ నాయకులు యాగంటి మల్లికార్జునరావు, కజ్జం సైదయ్య, మద్దిగపు వెంకటరామిరెడ్డి, యెనుముల కేశవరెడ్డి, రాజబోయిన మధు, కొమెర దుర్గారావు, శశిరెడ్డి, బీజేపీ నాయకులు క్రాంతి కుమార్, జనసేన నాయకులు లాల్ కిషన్, నర్రా రాముడు, కమాలకర్, భాగం హనుమంతరావు, వంకయాలపాటి రాజు కుమార్, చల్లా సాంబ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతే లక్ష్యంగా సీఐ మల్లికార్జున ప్రత్యక్ష పోలీసింగ్ కంభం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ

(షణ్ముఖ వెలుగు, కంభం, సెప్టెంబర్ 26)

మార్కాపురం జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా ఆదేశాల మేరకు ప్రత్యక్ష పోలీసింగ్‌లో భాగంగా కంభం ఆర్టీసీ బస్టాండ్ కేంద్రంగా పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు. కంభం సీఐ మల్లికార్జున, ఎస్ఐ శివకృష్ణారెడ్డి ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలను సందర్శించి ట్రాఫిక్ పరిస్థితిని పరిశీలించారు. బస్టాండ్ వద్ద వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించి, ప్రయాణికులు మరియు వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. బస్టాండ్ పరిసరాల్లో ట్రాఫిక్ క్రమశిక్షణ పాటించేలా వాహనదారులకు సూచనలు చేశారు. ప్రజలకు పోలీసుల అందుబాటు మరింత పెంచడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.





షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com

పల్లె పండుగ విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలి

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ఏర్పాట్ల పై ఏలూరి విస్తృత సమీక్ష

అధికారులకు సూచనలు



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, సెప్టంబర్ 26)

పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు సమన్వయంతో పనిచేయాలని పర్చూరు ఎమ్మెల్యే, నియోజకవర్గ పరిశీలకుడు ఏలూరి సాంబశివరావు సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని కోరారు. శుక్రవారం వింజమూరు, దుత్తలూరు, కలిగిరి మండలాల్లో ఆయన పర్యటించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 29న ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం రామాపురం గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించనున్న పల్లె పండుగ 3.0 కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఏలూరి సూచించారు. గ్రామస్థాయిలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, భద్రత తదితర అంశాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న పల్లె పండుగ 3.0ను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆయా మండలాలకు చేరుకున్న ఏలూరికి అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత పై వాహనదారులకు అవగాహన కల్పించిన సిఐ రాజేష్ కుమార్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 26)

రోడ్డు భద్రతపై వాహనదారులకు సిఐ రాజేష్ కుమార్ అవగాహన కల్పించారు. శనివారం సాయంత్రం స్థానిక పెద్ద బస్టాండ్ సెంటర్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రయాణ సమయంలో వేగ పరిమితులు పాటించి, ప్రాణాలను రక్షించుకోవాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరంతో పాటు ప్రాణాంతకమన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్ల వాడకాన్ని పూర్తిగా నివారించాలని, ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మైదుకూరులో పోలీసుల విస్తృత తనిఖీలు

23 రికార్డుల్లేని వాహనాలు స్వాధీనం

పాత నేరస్తులు, అనుమానితుల ఇళ్లలో క్షుణ్ణంగా సోదాలు

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక









(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టంబర్ 26)

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజామున మైదుకూరు పట్టణ పరిధిలోని కొత్తకొట్టాలు, గాంధీనగర్, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పాత నేరస్తులు, అనుమానితుల ఇళ్లతో పాటు అనుమానిత ప్రాంతాల్లో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. వేటకొడవళ్లు, బాంబులు, నిషేధిత ఆయుధాల కోసం విస్తృతంగా సోదాలు నిర్వహించారు. వాహనాల రికార్డులను పరిశీలించగా రికార్డులు లేని 23 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తక్కువ ధరకు వస్తున్నాయనే కారణంతో రికార్డులు లేని వాహనాలను కొనుగోలు చేయవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. అలాంటి వాహనాలను కొనుగోలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లు, సస్పెక్ట్ షీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎవరూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని, గొడవలకు దూరంగా ఉంటూ తమ పనులు చేసుకుంటూ ఆర్థికంగా ఎదిగి పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం లేదా అనుమానితుల కదలికలు కనిపిస్తే వెంటనే డయల్ 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో మైదుకూరు అర్బన్ ఇన్‌స్పెక్టర్ కె రమణారెడ్డి, ఎస్ఐలు చిరంజీవి, వెంకట రమణతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మాత్రల పంపిణీ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 26)



జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని యెడుగుండ్లపాడు వద్ద శ్రీ హర్షిణి మహిళా ఇంజినీరింగ్ మరియు సాంకేతిక కళాశాలలో విద్యార్థినులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన సుమారు 800 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లికళాశాల చైర్మన్ శ్రీ గోరంట్ల రవికుమార్, కరస్పాండెంట్ శ్రీమతి గోరంట్ల కవిత, డైరెక్టర్ శ్రీ గోరంట్ల హర్షిత్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, కళాశాల బోధనా మరియు బోధనేతర సిబ్బంది, మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రవణ్ కుమార్, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. డాక్టర్ శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది విద్యార్థినులకు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పిస్తూ, నులిపురుగుల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నులిపురుగుల కారణంగా పోషకాహార లోపం, రక్తహీనత, కడుపు నొప్పి, ఆకలి తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, ఆరోగ్య శాఖ సూచనల మేరకు నులిపురుగుల నివారణ మాత్రలను తీసుకోవడం ద్వారా వీటిని నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి, మధ్యస్థ స్థాయి ఆరోగ్య సేవా సిబ్బంది, సహాయక నర్సు మరియు ప్రసూతి సహాయకులు, ఆశా కార్యకర్తలు పాల్గొని విద్యార్థినులకు అవసరమైన ఆరోగ్య సూచనలు అందించారు. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, భోజనానికి ముందు, తరువాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడంతో పాటు సురక్షితమైన తాగునీటిని వినియోగించాలని సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో నులిపురుగుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెంపొందింది. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని, ఆరోగ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వైద్య సిబ్బంది సూచించారు.

ప్రకాశం జిల్లాలో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 26)


ప్రకాశం జిల్లాలో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ కలెక్టర్, దళాధిపతి జీఎస్ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్ ఘనంగా ప్రారంభించారు. ఒంగోలు క్లాపేట 5వ లైన్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీకి మొట్టమొదటి కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యాలయాన్ని వినియోగించుకోవచ్చన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయడమే కార్యాలయం ఏర్పాటు ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుత పాలనపై విమర్శలు చేసిన ఆయన గతంలో అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రజలకు

2029 ఎన్నికలే లక్ష్యంగా ప్రజలకు చేరువవుతాం

జిఎస్ఆర్‌కె ఆర్ విజయ్‌కుమార్

ఇచ్చిన వాగ్దానాలను విస్మరించి, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించే రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం, గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా లిబరేషన్ కాంగ్రెస్ పార్టీని ప్రజల ముందుకు తీసుకువస్తున్నామని తెలిపారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని ప్రజలు ఆదరిస్తే నిజమైన ప్రజా పాలన ఎలా ఉంటుందో చేసి చూపిస్తామని అన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కమాండర్స్, కెప్టెన్స్, పైలట్స్ పేరుతో పార్టీ సైన్యాన్ని తయారు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కార్యాలయాలు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ప్రజా సమస్యలపై ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ చిట్టితోటి శోభన్ బాబు, ఒంగోలు నగర ఇంచార్జ్ జిలకర సుబ్బారావు, నాయకులు పికె రాజేశ్వరరావు, విజయ్‌బాబు, పిచ్చయ్య, పోలయ్య, ప్రభు దాస్, మహిళ విభాగం నాయకురాలు హెబ్సీబా రాణి, స్రవంతి, వివిధ జిల్లాల నాయకులు, ప్రకాశం జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, పార్టీ పెద్దలు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం మరణించిన వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాకుమాను రాజశేఖర్ పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.





మార్కాపురం పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి






(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టంబర్ 26)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలోని 13, 14, 15 వార్డులలో వీధి వీధి పర్యటించి స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. అనంతరం ఆయా వార్డుల్లో అప్పటికప్పుడు ప్రజల కోరిక మేరకు 15 ఫైనాన్స్, హెచ్ఏఎం నిధులతో అప్పటికప్పుడు రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ త్వరలో ఈ రోడ్లను పూర్తి చేసి మార్కాపురం పట్టణంలో ప్రతి రోడ్డును సిసి రోడ్డుగా మార్చి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మార్కాపురం పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం నాయకులు, స్థానిక తెలుగుదేశం నాయకులు, ఆయా వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రామాయపట్నం రహదారి నిర్మాణం పై దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ పి రాజాబాబు





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టంబర్ 26)

జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే కూటమి ప్రభుత్వం రామాయపట్నం రహదారి నిర్మాణం పై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రవాణా, రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి కోన శశిధర్ శనివారం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ఇందులో పాల్గొన్నారు. అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో కేంద్ర ప్రభుత్వం వచ్చే సోమవారం సమావేశం నిర్వహించనున్నది. ఈ దృష్ట్యా జిల్లాలకు అవసరమైన కీలక రహదారుల ప్రతిపాదనలు, అమలు చేస్తున్న వినూత్న ఆలోచనలపై శశిధర్ ఆరా తీశారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ మార్కాపురం జిల్లాలోని కుంట నుంచి ప్రకాశం జిల్లాలోని దొనకొండ ఇండస్ట్రియల్ ఏరియా, చీమకుర్తి గ్రానైట్ ప్రాంతం మీదగా రామాయపట్నం వరకు రహదారి అవసరం ఉందన్నారు. ఇది అందుబాటులోకి వస్తే ఇప్పటికే కుంట నుంచి ఉన్న 765 జాతీయ రహదారితో కలవడం ద్వారా హైదరాబాదుకు అనుసంధానం మరింత పెరుగుతుందన్నారు. ఫలితంగా వాణిజ్య కార్యకలాపాలు పెరిగి జిల్లా ఆర్థిక ప్రగతికి మరింత ఊతం లభిస్తుందన్నారు. కీలకమైన ఈ రహదారి నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించామని, త్వరగా అందుబాటులోకి వచ్చేలా చూడాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను, వివిధ ప్రాజెక్టులకు భూసేకరణ తీరును కూడా ఆయన వివరించారు. ఈ సమావేశంలో డిటిసి సుశీల, రోడ్లు, భవనాల శాఖ ఎస్ఈ రవి నాయక్, సీపీఓ సుధాకర్‌రెడ్డి, భూసేకరణ విభాగ సూపరింటెండెంట్ నాగలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com

పోలీసు అంటే భయం కాదు ప్రజలకు భరోసా

క్రమశిక్షణ, నిజాయితీ, మానవత్వంతో విధులు నిర్వహించాలి

521 మంది నూతన కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్‌లో మంత్రి ఎస్ సవిత







(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, సెప్టంబర్ 26)

పోలీసు విధుల్లో క్రమశిక్షణ, నిజాయితీ, ధైర్యం, మానవత్వం ఎంతో కీలకమని, "పోలీసు అంటే భయం కాదు.. ప్రజలకు భరోసా" అనే భావన ప్రజల్లో కలిగేలా ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, వైఎస్సార్ కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్ సవిత నూతన కానిస్టేబుళ్లకు పిలుపునిచ్చారు. బాకరాపేటలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ పోలీసు పరేడ్ మైదానంలో శనివారం 521 మంది నూతన కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సవిత హాజరై నూతన కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. తొమ్మిది నెలల ప్రాథమిక శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 521 మంది కానిస్టేబుళ్లు పరేడ్‌లో పాల్గొన్నారు. వీరిలో కడప పోలీసు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన 194 మంది సివిల్ ఎస్‌సీటీపీసీలు, 11వ బెటాలియన్‌కు చెందిన 327 మంది ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు.

పోలీసు వ్యవస్థకు కానిస్టేబుళ్లే వెన్నెముక

పోలీసు వ్యవస్థకు కానిస్టేబుళ్లే వెన్నెముక అని మంత్రి సవిత అన్నారు. దీక్షాంత్ పరేడ్ శిక్షణార్థి నుంచి బాధ్యతాయుతమైన పోలీసు సిబ్బందిగా మారే కీలక ఘట్టమని పేర్కొన్నారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో నూతన కానిస్టేబుళ్లు కీలక పాత్ర పోషించాలన్నారు. పోలీసులు చట్టాన్ని గౌరవిస్తూ ప్రతి ఒక్కరినీ సమానంగా చూడాలని, మహిళలు, చిన్నారులు, వృద్ధులు, బలహీన వర్గాల రక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజల సమస్యలను ఓపికగా విని మానవీయ దృక్పథంతో స్పందించాలన్నారు. సైబర్ నేరాలు, సాంకేతిక ఆధారిత నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వంటి కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంతోపాటు కొత్త చట్టాలపై నిరంతరం అవగాహన పెంచుకోవాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. పోలీసు కుటుంబాల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

యూనిఫాం గౌరవంతో పాటు బాధ్యతను ఇస్తుంది

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

పోలీసు యూనిఫాం గౌరవాన్ని మాత్రమే కాకుండా గొప్ప బాధ్యతను కూడా ఇస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. తొమ్మిది నెలల కఠిన శిక్షణ అనంతరం ప్రజాసేవలోకి అడుగుపెడుతున్న ప్రతి కానిస్టేబుల్ విధి పట్ల అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజలతో మర్యాదగా, నిష్పక్షపాతంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని, బాధితులకు అండగా నిలిచి చట్టాన్ని కాపాడుతూ ప్రజలకు భద్రత కల్పించాలని అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలి : ఎస్పీ

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ తొమ్మిది నెలల శిక్షణలో నేర్చుకున్న క్రమశిక్షణ, సమయపాలన, శారీరక దారుఢ్యం, విధి నిర్వహణ నైపుణ్యాలను పోలీసు సేవలో కొనసాగించాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ వారి విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని, నిజాయితీ, అంకితభావం, ధైర్యంతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి పురస్కారాలు

దీక్షాంత్ పరేడ్ సందర్భంగా శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కానిస్టేబుళ్లకు మంత్రి సవిత, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పురస్కారాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో 11వ బెటాలియన్ కమాండెంట్ ఆనంద్ రెడ్డి, కడప డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాజశేఖర్, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బంది, శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు, వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చెత్త నుండి సంపద తయారీ కేంద్ర పరిశీలన





(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, సెప్టంబర్ 26)

చిన్నగంజాం మండలం కడవకుదురు గ్రామంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని శనివారం మండల ఎంపీడీవో కె.ధనలక్ష్మి అధ్వర్యంలో డిప్యూటీ ఎంపీడీవో సుధాకర్ రావు, పి శ్రీనివాసరావు, 12 పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి వర్కర్స్, క్లాప్ మిత్ర, విఓఎల బృందం సందర్శించారు. అక్కడ వర్మి తయారీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వేయి కేజీల వర్మి చేసేలా ఉత్పత్తి ప్రక్రియ వేగవంతం చర్యలు తిసుకోవాలని అదేశించారు. అనంతరం ఎరుకల కాలనీలో 20 కుటుంబాల వారికి పొడి చెత్త-తడి చెత్త వేరు చేయు విధానాన్ని తెలుపుతూ, స్వచ్ఛ రథం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.

మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ఆరోగ్యం





(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టంబర్ 26)

మాచర్ల నియోజకవర్గం జమ్మలమడక గ్రామంలో పోషణ మాసం కార్యక్రమాలను నిర్వహించడం జరిగినది ప్రతి ఒక్కరూ మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల కూడా మంచి ఆరోగ్యం కలిగి ఉంటారని మరియు గర్భిణులు. బాలింతలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషణ కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది కాబట్టి ప్రతి ఒక్కరూ చేతలు శుభ్రంగా కడిగిన తర్వాత భోజనం చెయ్యాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి సిబ్బందిని సన్మానించారు. పాఠశాల హెచ్ఎం, సూపర్వైజర్, గ్రామ పెద్దలు, గర్భిణులు, బాలింతలు, ఆరోగ్య సిబ్బంది సచివాలయం స్టాఫ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి పై శ్రద్ధలేని గొడ్డలి పార్టీ

రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టంబర్ 26)

రాష్ట్ర అభివృద్ధిపై గొడ్డలి పార్టీ అయిన వైసీపీకి శ్రద్ధ లేదని మంత్రి గొట్టిపాటి విమర్శించారు. రాష్ట్రంలో మృతి చెందిన వారంతా తమ వారేనంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో సత్యదూరమైన మాటలతో ప్రజలను మభ్యపెట్టారని ఆరోపించారు. అభివృద్ధి చేయకుండా రాష్ట్రంలోని వ్యవస్థలను వైసీపీ నేతలు దెబ్బతీసి సర్వ నాశనం చేశారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి వైసీపీకి కనబడటం లేదని ఎద్దేవా చేశారు. ఓర్వలేనితనంతో ప్రతి విషయం పై అక్కసు వెళ్లగక్కుతున్నారన్నారు. డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులపై కూడా దాడులకు తెగబడుతున్నారని తెలిపారు. టీచర్ల పై దాడులు బాధాకరమన్నారు. అది వైసీపీకే నష్టం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, విజయ్ కుమార్‌తో పాటు పలువురు కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

బాలినేని పై కుట్ర జరుగుతుంది

జనసేన యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి

జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసిన ప్రణీత్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 26)

మాజీ మంత్రి బాలినేని పై కుట్ర జరుగుతుందని జనసేన యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి ఆరోపించారు. శనివారం జిల్లా ఎస్పీ వి వ ర్ణ ప వ ర్థ న్ రా జు ను మర్యాదపూర్వకంగా కలిసి తన తండ్రి, జనసేన రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పై చేస్తున్న కుట్రల పై లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన ఎస్పీ కార్యాలయ ఆవరణలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ జనసేనలో బాలినేని చేరింది తన మైన్స్‌ను రక్షించుకునేందుకు వచ్చారని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కూటమిలో ఉన్నందునే తాము ఏమీ మాట్లాడలేదని తెలిపారు. వాస్తవాలు తెలుసుకుని ప్రచారం చేయాలని సూచించారు. ఏపి ఎండిసి మైన్స్‌ను ఆపే అధికారం ఎవరికీ లేదన్నారు. ప్రభుత్వానికి నష్టం వస్తున్నప్పటికీ తాము జనసేనలో చేరిన రెండేళ్ళ వరకు కూడా ఆపివేశారన్నారు. ఈ విషయం పై పవన్ కళ్యాణ్‌కు కూడా వాస్తవాలు వివరించామన్నారు. దీనిని ఆపిన వారిని పవన్ కళ్యాణ్ సైతం మందలించారని తెలిపారు. కూటమి కోసమే తాము నోరు మెదపడం లేదన్నారు. ఆరుకోట్లు వస్తాయని చెబుతున్న వారు తమకు కోటి రూపాయలు ఇచ్చి ఆ మైన్స్‌ను తీసుకోవచ్చని స్పష్టం చేశారు. జనసేనలో బాలినేని స్థాయి పెరగడంతో దానిని జీర్ణించుకోలేక నే ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. తమను ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ టార్గెట్ చేస్తున్నారన్నారు. తమ పై సామాజిక మాధ్యమాలు, సోషల్ మీడియా వేదికగా ఫేక్ ఎస్ఎంఎస్‌లతో చేస్తున్న తప్పుడు ప్రచారం విషయంలో బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. ప్లేస్ మీరు చెప్పినా సరే నన్ను చెప్పమన్నా సరే చెబుతాను...నేరుగానే తేల్చుకుందామని బాలినేని ప్రణీత్‌రెడ్డి సూటిగా ప్రశ్నించారు. కూటమి ధర్మాన్ని తప్పకూడదనే చాలా విషయాలు తాము బహిర్గతం చేయడం లేదన్నారు. ఇప్పటికైనా తమ కుటుంబం పై అసత్య ఆరోపణలు చేయడం మానుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజలే సరైన గుణపాఠం చెబుతారన్నారు. ఎస్పీని కలిసిన వారిలో జనసేన సెంట్రల్ ఆంధ్ర కన్వీనర్ చీకటి వంశీదీప్, మాజీ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఈదర వెంకట సురేష్‌బాబు, యనమల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసాత్సవాలు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టంబర్ 26)

శనివారం కనిగిరి మండలం గురవాజీపేట 2, కృష్ణాపురం అంగన్వాడీ కేంద్రాలలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా అంగన్వాడీ ఉత్సవం ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎంవిఎస్ పార్వతి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. గురువాజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ షేక్ గుల్షాన్, కే మహేష్ పాల్గొన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖలు సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ ప్రధానమంత్రి 25 సంవత్సరాల ప్రజా సేవను పురస్కరించుకొని సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా అంగన్వాడి ఉత్సవం నిర్వహిస్తున్నారని, అంగన వాడి కేంద్రాల ద్వారా అందుతున్న పౌష్టికాహారం, మాతృ సంరక్షణ, ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం కింద లబ్ధి పొందిన వారు, మెనూ చార్ట్ ప్రదర్శన, ప్రీస్కూల్ మధ్యాహ్న భోజనం, పిల్లల ఎత్తు బరువులు, గర్భిణీలు, బాలింతలు, 6-3 సంవత్సరాల పిల్లలకి ఇంటికి ఇచ్చే పోషకాహారం గురించి వివరించారు. డాక్టర్ గుల్షాన్ గర్భవతులు, బాలింతలు పిల్లల్లో రక్తహీనత, పోషకాహారం ప్రాముఖ్యత, వ్యాక్సినేషన్, పరిశుభ్రత గురించి తెలియజేశారు. పథకాల అమలుపై లబ్ధిదారుల నుండి అభిప్రాయాలను తెలుసుకున్నారు. చిన్నారులకు ఆటలు, పాటలు, కథల పోటీలు నిర్వహించి వారికి బహుమతులు, మిఠాయిలు పంపిణీ చేశారు. అంకితభావంతో సేవ చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలను సూపర్వైజర్ సన్మానించిరి. పోషక మాసం ప్రతిజ్ఞ చేయించిరి. తదుపరి గ్రామంలో అంగనవాడి ఉత్సవం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ షేక్ గుల్షాన్, కె మహేష్, ఆశా వర్కర్ రూప, అంగన్వాడీ కార్యకర్తలు బాలనాగమ్మ, రాజేశ్వరి, కుమారి, ఝాన్సీ రాణి, రాజేశ్వరి, శైలజ, హెల్పర్లు శాంతి, సృజన, సింధుజ, గ్రామంలోని గర్భవతులు, బాలింతలు, తల్లులు, కిషోర్ బాలికలు, ఏఎంసీ సభ్యులు, పిల్లలు పాల్గొన్నారు.

మార్కాపురం జిల్లా ప్లానింగ్ అండ్ యంఐఎస్ కోఆర్డినేటర్ గా డాక్టర్ మొర్రి పిచ్చయ్య నియామకం

నియామక పత్రాన్ని అందుకున్న మొర్రి పిచ్చయ్య





(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, సెప్టంబర్ 26)

మార్కాపురం జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్షా పరిధిలోని జిల్లా ప్లానింగ్ అండ్ యంఐఎస్ కోఆర్డినేటర్ గా డాక్టర్ మొర్రి పిచ్చయ్య నియమితులయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి సామ సుబ్బారావు నియామక ఉత్తర్వులను అందజేశారు. డాక్టర్ మొర్రి పిచ్చయ్య హై స్కూల్ ప్లస్, గిద్దలూరు నందు పిజిటి (తెలుగు)గా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా విద్యా ప్రణాళిక, కార్యక్రమాల పర్యవేక్షణ, విద్యా సమాచార సేకరణ, డేటా నిర్వహణ, విశ్లేషణ, నివేదికలను రూపొందించాలి. మండలాల నుంచి వచ్చిన డేటాను పరిశీలించి సమీకరించడం. పాఠశాలలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించడం తదితర కార్యక్రమాలు నిర్వహించవలసి ఉంటుంది. మండల విద్యాశాఖ అధికారులు గిరిధర్ శర్మ, నాగభూషణరెడ్డి, కావడి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ బృందం జయచంద్రారెడ్డి, రంగారెడ్డి, రమేష్, వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి



మాజీమంత్రి దేవినేని, ఎమ్మెల్యే ఇంటూరి పిలుపు
కందుకూరులో పార్టీ శ్రేణులతో సమావేశం
నియోజకవర్గం నుంచి 10వేల మంది తరలి వెళ్లేలా ఏర్పాట్లు





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, సెప్టెంబర్ 26)
ఈ నెల 29వ తేదీన ఉదయగిరి నియోజకవర్గంలో జరగబోయే పల్లె పండుగ 3.0 ప్రారంభం కార్యక్రమంలో కందుకూరు నియోజకవర్గం నుంచి పదివేల మందికి పైగా తరలివెళ్లి జయప్రదం చేయాలని టిడిపి సీనియర్ నాయకులు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సీఎం సభను విజయవంతం చేసేందుకు, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గస్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. పరిశీలకుడిగా నియమితులైన దేవినేని ఉమామహేశ్వరరావు సమావేశంలో పాల్గొన్నారు. ముందుగా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. దేవినేని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పల్లె పండుగ 1, 2 ద్వారా గ్రామాల్లో వందల కోట్ల రూపాయలతో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలు జరిగాయన్నారు. మూడోవిడత కార్యక్రమాన్ని, ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం రామాపురంలో సీఎం చంద్రబాబు గారు 29వ తేదీన లాంఛనంగా ప్రారంభిస్తారని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పాల్గొంటారని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడమే గాక, దానిని పూర్తి చేసి, జాతికి అంకితం చేసిన అపర భగీరథుడు చంద్రబాబు అని ఉమామహేశ్వరరావు కొనియాడారు. దానిద్వారా మార్కాపురం, ప్రకాశం జిల్లాలు సస్యశ్యామలం కాబోతున్నాయని చెప్పారు. పట్టిసీమ ప్రాజెక్టుతో కొన్నివేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. పోలవరం సహా రాష్ట్రంలో ఇంకా అనేక ప్రాజెక్టులను పూర్తి చేసి, ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని దేవినేని వెల్లడించారు. అంత కష్టపడి పూర్తిచేసిన వెలిగొండ ప్రాజెక్టును ప్రతి ఒక్కరూ చూసి రావాలని ఆయన సూచించారు. గొట్టిపాటి కొండప నాయుడు కాలువ పనులను పూర్తిచేసి, కందుకూరు ప్రాంతంలో రాళ్లపాడు రిజర్వాయరుకు సోమశిల ప్రాజెక్టు నుంచి నీరు తీసుకొచ్చిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదన్నారు. కందుకూరు మున్సిపాలిటీకి ఎన్నికలు జరగకుండా అడ్డుకుంటున్నారు. కోర్టులో కేసులు వేయించారు. వందల కోట్ల నిధులు ఆగిపోవడానికి వైసిపి నేతలుకారణం కాదా ? ఏ మొహం పెట్టుకొని మళ్ళీ జనాల్లోకి వెళతారు? స్థానిక సంస్థలు ఎన్నికల్లో వాళ్లకు బుద్ధి చెప్పాలి. చిత్తుగా ఓడించాలి అని ఉమామహేశ్వరరావు కోరారు. 2019-24 మధ్య గొడ్డలిపార్టీ చేసిన విధ్వంసం ఎవరైనా మరిచిపోతారా? జనం చీకొట్టినా వాళ్ళు మారలేదు. డీఎస్సీపై వందల పిటిషన్లు వేస్తే కోర్టు కొట్టేసింది. టీచర్లపై దాడులు చేస్తున్నారు. ఇదేం సంస్కృతి? స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అభివృద్ధి వేగంగా జరుగుతోంది. 20 సంవత్సరాల తర్వాత ఇక్కడ జెండా ఎగరేసిన సత్తా ఆయనది. కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే, స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలుచుకుంటారన్న నమ్మకం కనిపిస్తోంది. మళ్లీ విజయోత్సవ సభకు తప్పకుండా వస్తా అని నేతలు, కార్యకర్తల్లో దేవినేని ఉమామహేశ్వరరావు ఉత్తేజం నింపారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి మండలం నుంచి భారీ సంఖ్యలో మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు తరలిరావాలి. ప్రతి నాయకుడు జన సమీకరణ చేయాలి. సభకు బయలుదేరి వెళ్లి, తిరిగి వచ్చేంతవరకు బాధ్యత తీసుకోవాలి. పట్టణంతోపాటు ఐదు మండలాల నుంచి పదివేల మందికి పైగా తరలి రావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధిని ప్రజలందరూ చూస్తున్నారు. కందుకూరు రూపురేఖలు మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారం ఎంతో ఉంది. రాబోయే రోజుల్లో కందుకూరు ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి కాబోతోంది. మంచి మనసుతో వందల కోట్ల నిధులు ఇస్తున్నారు. దేవినేని ఉమామహేశ్వరరావు లాంటి సీనియర్ల సలహాలు తీసుకుంటూ ముందుకు వెళుతున్నాను. మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలి. ప్రభుత్వ పెద్దలందరూ పాల్గొనే సభను జయప్రదం చేయాలని కోరుతున్నానని నాగేశ్వరరావు అన్నారు. నియోజకవర్గ పరిశీలకురాలు ఎం శ్రావణిరెడ్డి మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. చంద్రబాబు నాయుడు లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చి రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నారు. యువతకు ఉద్యోగాలు వస్తున్నాయి. మహిళల ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. సీఎం కార్యక్రమాన్ని అందరూ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాయపాటి సుభాషిని శ్రీనివాసరావు, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీల అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, జనిగర్ల నాగరాజు, పూరిమిట్ల గురునాథం, మాదాల లక్ష్మీనరసింహం, మండలాల పరిశీలకులు పోకూరి రవీంద్రబాబు, చదలవాడ చంద్రశేఖర్, తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, కండ్రా మాల్యాద్రి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీను, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కల్లూరి శైలజ, ఇంకా పలువురు నాయకులు, అనుబంధ సంఘాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నవజాత శిశువుకు ప్రాణదానం
ఎమ్మెల్యే చొరవతో రూ.1.22 లక్షల వైద్య సాయం
ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న చిన్నారికి
సీఎంఆర్ఎఫ్ నుంచి ఎల్‌వోసీ మంజూరు



(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, సెప్టెంబర్ 26)
ఇంకొల్లు మండలం సూదివారిపాలేనికి చెందిన కొమ్ముబోయిన త్రివేణి మూడు రోజుల క్రితం చిలకూరుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చారు. అయితే జన్మించిన కొద్ది గంటల్లోనే చిన్నారికి ఇన్ఫెక్షన్ సోకడంతో వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారి ఆరోగ్యం క్షీణించకుండా ఉండేందుకు మూడు రోజుల పాటు ప్రత్యేక పరికరం (ఇంక్యుబేటర్)లో ఉంచి చికిత్స అందించాల్సి ఉంటుందని వైద్యులు సూచించారు. ఈ చికిత్సకు అయ్యే భారీ వ్యయాన్ని భరించే స్థోమత లేని నిరుపేద కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వెంటనే స్పందించి, చిన్నారికి అత్యవసర వైద్యం అందించేలా ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సాయం మంజూరు చేయాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆయన చొరవతో గుంటూరులోని వేదాంత హాస్పిటల్స్‌లో చికిత్స నిమిత్తం రూ.1,22,373 మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) మంజూరు చేసింది. తమ చిన్నారికి సకాలంలో ప్రాణదానం చేసిన ఎమ్మెల్యే ఏలూరికి శిశువు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. పేద ప్రజల కష్టాలను స్వయంగా పరిష్కరిస్తూ, అవసరమైన ప్రతి సందర్భంలో అండగా నిలుస్తానని ఎమ్మెల్యే సాంబశివరావు తెలిపారు.

అవినీతిపై చర్చకు సిద్ధమా?



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, సెప్టెంబర్ 26)
రాష్ట్రంలో కొత్తగా మంజూరు కాబోతున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల వ్యవహారంలో వైసీపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని పొన్నలూరు మండల తెలుగుదేశం పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం వారు మాట్లాడుతూ పింఛన్ల దరఖాస్తుదారుల నుంచి తాము డబ్బులు వసూలు చేస్తున్నట్లు వైసిపి నేతలు ఆరోపించడం పై మండిపడ్డారు. ఒక్కరి దగ్గరయినా డబ్బులు తీసుకున్నట్టు నిరూపించాలని సవాల్ విసిరారు. అవినీతికి పాల్పడ్డ చరిత్ర వైసిపిది, ఆ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డిది అని విమర్శించారు. గత ప్రభుత్వంలో ప్రతి విషయంలో వైసిపి నేతలు అక్రమాలకు పాల్పడి, ప్రభుత్వ సొమ్మును దోచుకున్నారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంలో నిస్పక్షపాతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ఎవరి హయాంలో అక్రమాలు జరిగాయో ప్రజలకు తెలుసున్నారు. వైసీపీ నేతలు ఇకనైనా బుద్ధి మార్చుకుని ప్రవర్తించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కర్ణ కోటిరెడ్డి, కొండ్రగుంట శ్రీనివాసులు, మండవ ప్రసాద్, గుమ్మల వెంకట్రావు, పల్లపోతు రమేష్ బాబు, డి మధుబాబు, మన్యం రమణయ్య, పి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ క్యాడర్ సమస్యల గురించి చర్చించిన ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 26)
ఒంగోలులో మంగమూరు రోడ్డులో మర్రిచెట్టు దగ్గర శనివారం సంతనూతలపాడు ఎమ్మెల్యే కార్యాలయంలో పార్టీ క్యాడర్‌తో పొలిటికల్ దర్బార్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బి ఎన్ విజయ్‌కుమార్ నిర్వహించారు. ఈ పొలిటికల్ దర్బార్‌లో నాయకులను, కార్యకర్తలను కలిసి వారి సమస్యల గురించి ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. వివిధ గ్రామ నాయకులు, కార్యకర్తలు, పలు అభివృద్ధి సమస్యల గురించి ఎమ్మెల్యేకి వివరించారు. వారి సమస్యలను ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ తక్షణమే పరిష్కారం చూపుతానని నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం సూచించారు. ఈ కార్యక్రమంలో మద్దిపాడు మండల నాయకులు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, గట్టినేని అయ్యన్న, పోతినేని శ్రీనివాసరావు (పిఎస్ఆర్), నల్లూరి శ్రీనివాసరావు, మార్నేని రాఘవ, మందపల్లి శ్రీనివాసరావు, నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమను ప్రపంచ ఉద్యాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రీల్, వీడియో కాంటెస్ట్
ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజబాబు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 26)
రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలను భారతదేశంలోనే అత్యంత కీలకమైన గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా (ప్రపంచ ఉద్యాన కేంద్రం) అభివృద్ధి చేసేందుకు ఉద్దేశించిన బృహత్తర ప్రాజెక్ట్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఒక ప్రత్యేక రీల్, వీడియో కాంటెస్ట్‌ను ప్రారంభించిందని ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజబాబు తెలిపారు. ఈ పోటీ ద్వారా రాయలసీమ ప్రాంత అభివృద్ధి, సాగునీటి మౌలిక వసతుల కల్పన, తోటబడుల విస్తరణ, రైతుల సాధికారతను ప్రతిబింబించేలా క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, విద్యార్థులు, డిజిటల్ క్రియేటర్లు తమ సృజనాత్మక వీడియోలతో డిజిటల్ మాధ్యమాల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పోటీకి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడిస్తూ, 60 నుండి 90 సెకన్ల నిడివి కలిగిన వీడియోలను సెప్టెంబర్ 26వ తేదీ నుండి సెప్టెంబర్ 30వ తేదీ మధ్యాహ్నం 12:00 గంటల వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. అందిన వీడియోల నుండి అత్యుత్తమ 5 వీడియోలను సెప్టెంబర్ 30 సాయంత్రానికి ఎంపిక చేసి, అక్టోబర్ 1వ తేదీన విజేతల పేర్లను ప్రకటిస్తారన్నారు. ఎంపికైన టాప్ 5 వీడియోల క్రియేటర్లను సుమారు 50,000 మంది పాల్గొనే వైభవంగా జరిగే ప్రధాన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, భారత ప్రభుత్వ ఆర్థికశాఖ మంత్రి చేతుల మీదుగా ఘనంగా సన్మానించడం జరుగుతుందని, అలాగే వారి వీడియోలను కార్యక్రమ వేదికపై ప్రదర్శిస్తారని కలెక్టర్ తెలిపారు. పోటీదారులు తమ వీడియోలను సోషల్ మీడియా వేదికల్లో అప్‌లోడ్ చేసే సమయంలో ఆంధ్రప్రదేశ్ డిజిటల్ కార్పొరేషన్ అధికారిక ఖాతా ఏపి అఫీషియల్ న్యూస్‌ను తప్పనిసరిగా ట్యాగ్ లేదా కొల్లాబరేట్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే కొన్ని అధికారిక హ్యాష్‌ట్యాగ్‌లను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. ఈ ప్రాజెక్ట్ విశేషాలను వివరిస్తూ, తక్కువ వర్షపాతం, కరువు పీడిత ప్రాంతంగా ఉన్న రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యానవన సాగుకు అనుకూలమైన వాతావరణం ఆధారంగా అభివృద్ధి చేయడమే దీని ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. దాదాపు రూ. 1,00,000 కోట్ల అంచనా వ్యయంతో ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్‌మెంట్ ప్లాన్ ద్వారా 2026 నుండి 2029 వరకు మూడు విడతల్లో 10 జిల్లాల్లోని 201 క్లస్టర్లలో ఈ ప్రాజెక్ట్ అమలు కానుందని వివరించారు. దీనిద్వారా 6 లక్షల హెక్టార్లలో కొత్తగా తోటబడుల విస్తరణ జరిగి, 9.6 లక్షల మంది రైతు కుటుంబాలకు ప్రత్యక్ష మేలు కలగడమే కాకుండా 49.3 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఫలితంగా రూ. 81,000 కోట్ల అదనపు ఆర్థిక ప్రయోజనం సమకూరుతుందని తెలిపారు. మామిడి, అరటి, టమోటా, దానిమ్మ, ఖర్జూరం, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్ వంటి పంటల ఉత్పత్తి, ఎగుమతులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతం భారతదేశంలోనే అతిపెద్ద ఫ్రూట్ బౌల్‌గా అవతరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కావున డిజిటల్ క్రియేటర్లు, యువత, విద్యార్థులు తమ సృజనాత్మకతను చాటుకుంటూ ఈ కార్యక్రమంలో విశేషంగా పాల్గొని దీనిని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

చలో విజయవాడ కార్యక్రమానికి అనుమతులు లేవు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టెంబర్ 27)
మార్కాపురం జిల్లా 'స్వర్ణ గ్రామం-స్వర్ణ వార్డు' కార్యక్రమానికి సంబంధించి సచివాలయ ఉద్యోగులు చేపట్టనున్న 'చలో విజయవాడ' కార్యక్రమానికి ఎటువంటి అనుమతులు మంజూరు కాలేదని మార్కాపురం జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా తెలిపారు. అనుమతులు లేకుండా నిర్వహించే కార్యక్రమాల్లో ఉద్యోగులు పాల్గొనవద్దని ఎస్పీ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. అనుమతులు లేకుండా ర్యాలీలు, సభలు లేదా ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, చట్టపరమైన నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్పీ పంకజ్ కుమార్ మీనా విజ్ఞప్తి చేశారు.

నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు



(షణ్ముఖ వెలుగు, మేదరమెట్ల, సెప్టెంబర్ 26)
జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా కొరిశపాడు మండలం మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆశాలత ఆధ్వర్యంలో విద్యార్థులతో మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగుల వల్ల పిల్లల్లో ఎదుగుదల మందగించడంతో పాటు రక్తహీనత సమస్య ఏర్పడే అవకాశం ఉందన్నారు. నులిపురుగుల నివారణకు ప్రతి విద్యార్థి ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com